

సదావకాశం

గతంలో గృహ విద్యుత్ వినియోగదారులు ఎవరైనా సాధారణం కంటే అదనంగా వాడితే.. బిల్లుల మోత మోగేది. పేద, మధ్య తరగతి ప్రజలకు తెలియకుండానే ఆర్థిక భారం పడేది. ఈ నేపథ్యంలో దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కల్పించిన అదనపులోడు క్రమబద్ధీకరణకు శ్రీకారం చుట్టింది. మార్చి నుంచి జూన్ వరకు అవకాశం కల్పించినా ఆశించిన స్థాయిలో స్పందన లేదు. దీంతో డిసెంబరు ఆఖరి వరకు గడుపు పెంచుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. జిల్లాలోని నంద్యాల, డోన్, ఆత్మకూరు డివిజన్ పరిధిలో 5,84,839 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్లు అధికార లెక్కలు చెప్తున్నాయి. ఇప్పటి వరకు అధిక లోడు కింద 10,022 కేసులు నమోదు చేసి రూ.3.75కోట్లు అధికారులు వసూలు చేశారు. అధిక లోడు క్రమబద్ధీకరణకు 5255 మంది వినియోగదారులు దరఖాస్తు చేసుకున్నారు. వీరందరూ చెల్లించిన ఫీజుల పరంగా విద్యుత్‌శాఖకు రూ.69.55లక్షల ఆదాయం సమకూరినట్లైంది.

- అదనపు లోడు క్రమబద్ధీకరణకు గడువు పెంపు
- డిసెంబరు ఆఖరి వరకు చాన్స్
- ఆర్థిక భారం తగ్గించే దిశగా చర్యలు
- అధికలోడు కింద 10,022 కేసులు నమోదు
- జిల్లాలో ఇప్పటివరకు 5,255 దరఖాస్తులు
- రూ.69.55లక్షల ఆదాయం
- ప్రస్తుతం ఉన్నవాటిలో 50శాతం రాయితీ
- అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖాధికారులు


జిల్లా విద్యుత్‌శాఖ కార్యాలయం

అధిక శాతం అనుమతి తీసుకున్న..

జిల్లాలోని నంద్యాల, డోన్, ఆత్మకూరు డివిజన్ పరిధిలో 5,84,839 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్లు అధికార లెక్కలు చెప్తున్నాయి. ఇందులో అధిక శాతం అనుమతి తీసుకున్న కిలోవాట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్నట్లు ఆశాఖ వర్గాల నుంచి తెలుస్తోంది. ఇందుకు నిదర్శనం జిల్లాలో ఇప్పటి వరకు అధిక లోడు కింద 10,022 కేసులు నమోదు చేసి రూ.3.75కోట్లు వసూలు చేయడమే. చాలామంది వినియోగదారులు తెలియకనే అధిక విద్యుత్‌ను వినియోగించడం విద్యుత్ బిల్లుల మోత మోగి ఆర్థికంగా చితికిపోతున్నారని తెలుస్తోంది.

అదనపులోడు	సాధారణంగా చెల్లించాల్సిన	రాయితీతో చెల్లించాల్సిన
1	రూ. 2,250	రూ.1,250
2	రూ. 4,450	రూ. 2.450
3	రూ.6,650	రూ. 3,650

తక్కువ లోడు తీసుకుని..

సాధారణంగా ఎవరైనా విద్యుత్ కనెక్షన్ తీసుకునే సమయంలో తక్కువ లోడు తీసుకుని.. ఆతర్వాత వినియోగం పెరిగిన అదే లోడుతో వినియోగిస్తుంటారు. వారి తెలియక వాడేస్తుంటారు. ఈవిషయం అధికారుల తనిఖీలతో బట్టబయలవుతోంది. అధికలోడు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం డిసెంబరు ఆఖరి వరకు గడువు పెంచింది. దీంతో ఆయా క్యాటగిరిలకు చెందిన వినియోగదారులు ప్రతి అదనపు కిలో వాట్‌కు సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ. 200, డెవలప్‌మెంట్ చార్జీ రాయితీతో రూ.1000, దరఖాస్తు ఫీజు రూ.50 చెల్లించాలి. ఈ లెక్కన ఎన్ని కిలోవాట్లు వరకు లోడు పెరిగితే.. దరఖాస్తు ఫీజు మినహా మిగిలిన రెండు చార్జీలు రెట్టింపు చెల్లించాల్సి ఉంది. డెవలప్‌మెంట్ చార్జీలో 50శాతం రాయితీ కల్పించింది.

భవిష్యత్తులో రెట్టింపు..

అదనపులోడు క్రమబద్ధీకరణ కింద జిల్లాలోని 5255 మంది వినియోగదారులు దరఖాస్తు చేసుకున్నారు. వీరందరూ చెల్లించిన ఫీజుల పరంగా విద్యుత్‌శాఖకు రూ.69.55 లక్షల ఆదాయం సమకూరినట్లైంది. భవిష్యత్తులో రెట్టింపు స్థాయిలో పెరిగే అవకాశం ఉందని ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. ఏకంగా ప్రస్తుతం ఉన్న వాటిలో 50శాతం రాయితీ కల్పించడంతో ఆయా వర్గాలకు ఎంతో దోహదపడినట్లైంది.

నంద్యాల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల అదనపు లోడు క్రమబద్ధీకరణకు గడువు పెంచుతూ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ఏడాది మార్చి 1 నుంచి జూన్ వరకు అవకాశం కల్పించింది. ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. దీంతో వినియోగదారుల అభిప్రాయం మేరకు విద్యుత్‌శాఖ అధికారులు గడువు పెంచాలని నివేదిక అందజేశారు. ప్రభుత్వం స్పందించి ఈ ఏడాది డిసెంబరు ఆఖరి వరకు గడువు పెంచుతూ అనుమతించింది. దీంతో రోజురోజుకు ఆయా వర్గాల నుంచి దరఖాస్తులు వస్తున్నాయి. ఇదే క్రమంలో విద్యుత్‌శాఖ అధికారులు సైతం అవగాహన కల్పిస్తున్నారు. ఏదిఏమైనా అదనపులోడు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మరోమారు గడువు పెంచడంతో ఆయా వర్గాల్లో ఆర్థిక భారం తగ్గించే దిశగా చర్యలు తీసుకున్నట్లైంది.

సద్వినియోగం చేసుకోకపోతే..

అదనపులోడు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మరోమారు అవకాశం కల్పించింది. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోకపోతే భవిష్యతులో మరింత ఇబ్బందులు పడాల్సి వస్తుంది. డిసెంబరు గడువు ముగిసిన తరువాత కూడా అధికలోడు వినియోగించడం అధికారులు గుర్తిసే.. కేసులు నమోదు చేసి జరిమానాల రూపంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సిన దుస్థితి ఏర్పడనుంది.

వినియోగదారులు ఈ అవకాశాన్ని..



అదనపులోడు క్రమబద్ధీకరణకు డిసెంబరు వరకు ప్రభుత్వం గడువు కల్పించడం శుభ పరిణామం. ఇది అదనపు లోడు వినియోగదారులకు మంచి అవకాశం. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- సుధాకర్‌కుమార్, ఎస్ఈ, నంద్యాల

శ్రీశైలం జలాశయానికి భారీగా వరద

- నాలుగు గేట్ల ద్వారా నీటి విడుదల


గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న కృష్ణమ్మ

నంద్యాల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద ప్రవాహం వస్తోంది. తద్వారా జలాశయం నిండుకుండను తలపిస్తోంది. జూరాల, సుంకేసుల జలాశయాలతో పాటు హంద్రీ కలిపి మొత్తంగా 1,57,373 క్యూసెక్కులు నీరు వస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఆశాఖ అధికారులు నాలుగు క్రస్ట్‌గేట్లును 10 అడుగుల మేర ఎత్తి 1,08,628 క్యూసెక్కులు.. కుడి, ఎడమ గట్టు జల ఉత్పాదన కింద 65,689 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. అదేవిధంగా తెలంగాణాలోని కల్వాకుర్తికి 800 క్యూసెక్కుల మేర నీటిని వదిలారు. డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా... సాయంత్రం 6 గంటలకు 883 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 204.3520 టీఎంసీలుగా నమోదైంది.

విద్యావ్యవస్థను పటిష్టం చేయాలి

- క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలి
- ప్రతి సబ్జెక్టులో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మనదేశం 2047 కంతా అభివృద్ధి చెందాలంటే విద్యావ్యవస్థను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ రాజకుమారి అన్నారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో డీఈవో జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూల్‌కాంప్లెక్స్ బ్లాక్ వర్క్‌షాపులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రుల కలలను నెరవేర్చేలా పాఠశాల విద్యనుంచే విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. జిల్లాలో ప్రతి పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి వారిని ఉన్నతస్థాయికి చేర్చాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. ప్రతి సబ్జెక్టులో వంద శాతం ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుత టెక్నాలజీని ఉపయోగించుకుని అందుకు అనుగుణంగా బోధనా పద్ధతులను మార్చుకుంటూ ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో డీవైఈవోలు, ఎంఈవోలు, ఐసీడీఎస్, గిరిజన సంక్షేమ అధికారులు, సాంఘిక సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి దరఖాస్తులు

డీఈవో జనార్దన్‌రెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 5వ తేదీ గురు పూజోత్సవం సందర్భంగా జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో పనిచేస్తున్న హెచ్ఎంలు, ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. కనీసం పదేళ్ల పూర్తి చేసినవారు, ఏ విధమైన నేరారోపణలు, అభియోగాలు లేనివారు, గతంలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందని వారు మాత్రమే అర్హులని సూచించారు. దరఖాస్తులను ఈ నెల 19వ తేదీలోపు మండల విద్యాశాఖాధికారుల కార్యాలయాల్లో అందజేయాలని కోరారు.

రెండురోజుల పాటు వర్షాలు

- అప్రమత్తం చేసిన అధికారులు



నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల జిల్లాల్లో బుధ, గురువారాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం, అల్పపీడనం కారణంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. కర్నూలు జిల్లాలో మూడురోజుల పాటు(13,14,15 తేదీల్లో), నంద్యాల జిల్లాలో రెండురోజుల పాటు(బుధ, గురు) మోస్తరు నుంచి అక్కడక్కడా భారీ వర్షాలు పడే అవకాశముందని తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో కుందూ, తెలుగుగంగ, కేసీ కెనాల్‌కు జలవనరుల శాఖ అధికారులు నీటి ప్రవాహాన్ని తగ్గించారు. కుందూకు సంతజూటూరు పికప్ ఆనకట్ట నుంచి 12వేల క్యూసెక్కులు మాత్రమే నీటిని విడుదల చేస్తున్నామని, వర్షాల ప్రభావంతో కుందూ నదికి నీటి ఉధృతి పెరిగిందని కేసీ ఈఈ ప్రతాప్ తెలిపారు. అలాగే అన్ని కాల్వలకు నీటి విడుదలను తగ్గించామన్నారు.

- **అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ రాజకుమారి**

భారీ వర్షాల నేపథ్యంలో నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజకుమారి హెచ్చరించారు. అధికారులు నదీతీర ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని, మట్టిమిద్దెలు, శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించాలన్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న వారిని గుర్తించి సురక్షిత ప్రాంతానికి చేర్చాలని ఆదేశించారు.

సమన్వయంతో గ్రామాల అభివృద్ధి : జడ్పీ సీఈవో



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని జిల్లా పరిషత్ సీఈవో జి.నాసరరెడ్డి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీడీవోలకు మంగళవారం జడ్పీ ఆవరణలోని జిల్లా వనరుల శిక్షణ కేంద్రంలో ఒకరోజు శిక్షణ నిర్వహించారు. సీఈవో మాట్లాడుతూ పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు కలిగిన గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థులతోనే దేశ భవిష్యత్తు

- చిన్నారుల ఆరోగ్యంపై ప్రభుత్వాల ప్రత్యేక శ్రద్ధ
- రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్
- జిల్లాలో 4,22,251మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేశాం: డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ


విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులతోనే దేశ భవిష్యత్తు అని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. మంగళవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కాదరబాద్ నరసింగారావు మెమోరియల్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అధ్యక్షతన విద్యార్థులకు ఆల్బెండజోల్-400మి.గ్రా. మాత్రల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ఫరూక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేటి బాలలే రేపటి సమాజానికి మార్గదర్శకులు అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయన్నారు. విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా ఏడాదిలో రెండుసార్లు జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రోగ్రాం అధికారి డా.కాంతరావునాయక్ పర్యవేక్షిస్తారన్నారు. 1నుంచి 19సంవత్సరాల వయసున్నవారు జిల్లాలో 4,38,475మందిగా గుర్తించామన్నారు. జిల్లాలో 4,38,475మందికిగాను 4,22,251మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేశామన్నారు. ఈ రోజు మాత్రలు వేయించుకోనివారు ఈ నెల 20న తిరిగి మాప్‌అప్ రౌండ్ ద్వారా తిరిగి వేస్తామన్నారు. కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రోగ్రాం మానిటరింగ్ అధికారి డా.దేవసాగర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, స్టేట్ మానిటరింగ్ సహాయక అధికారి సుబ్రహ్మణ్యం, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్సులను కండిషన్‌లో పెట్టుకోండి

- మహిళల ఫ్రీ బస్సు సంబంధించి పలు సూచనలు
- ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు


ప్రయాణికులతో మాట్లాడుతున్న పూల నాగరాజు

నంద్యాల టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం కింద తిప్పే బస్సులను కండిషన్‌లో పెట్టుకోవాలని ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన నంద్యాల ఆర్టీసీ డిపోను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ కూడా ప్రయాణికులకు ఇబ్బంది కలిగించేవిధంగా ప్రవర్తించరాదని, వారిని గౌరవించాలన్నారు. ఆర్టీసీ ప్రాంగణంలో వస్తువులను ఎమ్మార్పీకే అమ్మాలని, లేని పక్షంలో వారి లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. గ్యారేజీలోని బస్సులను తనిఖీ చేసి వాటి పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. బస్సులోకి ఎక్కి ప్రయాణికులతో ఆయన మట్లాడి వారి సమస్యలను తెలుసుకుని తగిన రీతిలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈనెల 15నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. నంద్యాల డిపోలో 493 బస్సులు ఉండగా వాటిలో 378 బస్సులు పల్లెవెలుగు, డీలక్స్, అల్ట్రా డీలక్స్, సర్వీసులు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఆర్ఎం రజీయా సుల్తానా, డీఎం వినయ్‌కుమార్, ఏడీఎం కిషోర్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

మరో ముగ్గురు!

- ఉమ్మడి జిల్లాలో టీడీపీ నేతలకు నామినేటెడ్ పదవులు
- ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆకేపోగు ప్రభాకర్
- 'విశ్వబ్రాహ్మణ'కు కె.పార్వతమ్మ 'బొందిలి' చైర్మన్‌గా విక్రమ్ సింగ్


7

పులకించిన తుంగాతీరం

- వైభవంగా రాఘవేంద్రుడి మహారథోత్సవం


అశేష భక్తవాహిని నడుమ కొనసాగుతున్న రథోత్సవం


అలంకరణలో ప్రహ్లాదరాయులు, పీఠాధిపతి ఆశీర్వాదం



మంత్రాలయం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం తుంగాతీరం ఆధ్యాత్మిక పరవళ్లతో భక్తులు పరవశించిపోయారు. రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాల్లో ఐదో రోజు అత్యంత ప్రాముఖ్యమైన ఉత్తారాధనలో భాగంగా మంగళవారం మహా రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మూల బృందావనానికి విశేష పూజలు చేసి మహా మంగళహారతులు ఇచ్చారు. వజ్ర వైడూర్య రత్నాలతో పొదిగిన హారం, బంగారు ఆభరణాలతో అలంకృతుడైన ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను సంస్కృత పాఠశాల వరకు ఊరేగించి తిరిగి శ్రీమఠానికి తీసుకువచ్చారు. రంగులు చల్లుతూ వసంతోత్సవంలో భాగంగా మఠం అర్చకులు, మఠం సిబ్బంది భక్తులపై రంగులు చల్లుతూ ఉల్లాసంగా, ఉత్సాహంతో ముందుకు సాగారు. మహారథంపై నుంచి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు భక్తులకు ఆశీర్వాదం చేస్తూ తన సందేశాన్ని ఇచ్చారు. పహల్గామ్‌లో ఉగ్రవాదులు అమాయకుల పర్యాటకులను హతమార్చిన ఘటనపై ప్రతి ఒక్కరూ ఖండించి సనాతన హిందూ ధర్మాన్ని విశ్వవ్యాప్తికి ముందుకు తీసుకెళ్లారని అన్నారు. కుల, మత బేధం లేకుండా అందరికీ వరాలిచ్చే రాఘవేంద్రస్వామి సజీవంగా యోగ శక్తిలో భక్తుల కష్టాలు తీర్చి వరాలు ప్రసాదించే రాఘవేంద్రులు కృప ఉంటుందన్నారు.

హ్యాపీ టోల్‌గేట్!



- పంద్రాగస్టు నుంచి ఫాస్టాగ్ వార్షిక పాస్
- వాహనదారులకు భారీ ఊరట
- జాతీయ రహదారుల టోల్ ఫీజు నిబంధనలకు సవరణ
- రూ.3వేలతో గరిష్ఠంగా 200 ట్రిప్పులు

ఓర్వకల్లు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఇకపై వాహనదారులు నెలకు టోల్‌చార్జీల రూపంలో వేలకు వేల రూపాయలు వదిలించుకోవాల్సిన పనిలేదు. జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు కేంద్రం భారీ ఉపశమనం కలిగించింది. ఒకసారి రూ.3వేలు కడితే చాలు దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై ఉన్న టోల్‌గేట్ల మీదుగా గరిష్ఠంగా 200 సార్లు ప్రయాణించే అవకాశం కల్పించింది. 'వార్షిక పాస్' పేరుతో ఈ పథకాన్ని ఫాస్టాగ్ యూజర్ల కోసం ఆగస్టు 15వ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా అమలులోకి రానుంది. టోల్ ప్లాజా విధానం ద్వారా ప్రయాణీకులకు ఎంతో మేలు జరగనుంది. రూ.3వేల చెల్లింపుతో ప్రత్యేక టోల్ పాస్‌ను ఎవరైనా వ్యక్తిగత వాహనదారులు పొందవచ్చు. ఒక సంవత్సరం లేదా 200 టోల్ ప్రయాణాల వరకు వర్తిస్తుంది. కావాలనుకున్న వాహనదారులు మాత్రమే వార్షిక పాస్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15నుంచి ఈ ఫాస్టాస్ ఆఫర్ అందుబాటులోకి రానుంది. టోల్‌ప్లాజాను దాటిన ప్రతిసారి ఒక ట్రిప్పుగా లెక్క గడుతారు. మనం ప్రయాణంలో నాలుగు టోల్ ప్లాజాలు దాటితే.. నాలుగు ట్రిప్పులు పూర్తయినట్లు లెక్కిస్తారు. ఈ లెక్కన వార్షిక ఫాస్టాగ్ అనేది 200 సార్లు మాత్రమే పని చేస్తుంది. మొత్తం పూర్తి కాకపోతే ఏడాదంతా ఈపాస్ పనిచేస్తుంది. ఈ రెండింటిలో ఏదీ ముందుగా ముగిస్తే దానిని ఫాస్టాంగ్‌కు తుది గడువుగా పరిగణిస్తారు. ఫాస్టాగ్ వ్యక్తిగత వాహనదారులు మాత్రమే వర్తిస్తుంది. వాణిజ్య(కమర్షియల్) వాహనాలు, టాక్సీలకు వర్తించదు. అలాగే ఒక వాహనానికి జారీ చేసిన పాస్‌ను మరో వాహనానికి బదిలీ చేయడం కూడా వీలుకాదు. వాహన రిజిస్ట్రేషన్ నంబరు (వీఆర్ఎన్)తో రిజిస్ట్రేషన్ చేసిన ఫాస్టాగ్‌పై మాత్రమే ఈ పాస్ వర్తిస్తుంది. చాసిస్ నంబరుతో రిజిస్ట్రేషన్ చేసిన ఫాస్టాగ్‌లకు వర్తించదు. టోల్ ఫీజు ఎంత ఉన్నా నిబంధనలు లేకుండా టోల్ ప్లాజా దాటవచ్చు. ఈ వార్షిక పాస్‌ను టోల్‌ప్లాజాలో లేదా ఆన్‌లైన్‌లో పొందవచ్చు.





దరఖాస్తు ఇలా..

- రాజ్‌మార్గ్ యాత్ర మొబైల్ యాప్ అధికారిక వెబ్‌సైట్లు www.nhai.gov.in, www.morth nic.in సందర్శించాలి.
- వాహన రిజిస్ట్రేషన్ నెంబర్ ఫాస్టాగ్ ఖాతా వివరాలతో లాగిన్ కావాలి.
- రూ.3వేల ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలి. (యూపీఐ, డెబిట్, క్రెడిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉంటాయి)
- చెల్లింపు విజయవంతమైతే, పాస్ మీ ప్రస్తుత ఫాస్టాగ్ ఖాతాకి లింక్ అవుతుంది.
- డిజిటల్ రసీదును కూడా వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- పాస్ చెల్లుబాటు ఆగస్టు 15 నుంచి ప్రారంభమవుతుంది.

వాహనదారులకు గుడ్‌న్యూస్



వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ ఇచ్చింది. ఇక టోల్‌చార్జ్ రూ.15కే ఆగస్టు 15 నుంచి అమలు కానుంది. దేశంలో వాహనదారులకు శుభవార్త చెప్పింది. కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరి జూన్ 18వ తేదీన కీలక ప్రకటన చేశారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్ ద్వారా నిర్వహిస్తున్న కర్నూలు నుంచి కడప వరకు 40వ జాతీయ రహదారిలో ప్రయాణించే వేల మంది ప్రయాణీకులకు ఎంతో ఉపయోగపడుతుంది. ఈ మార్గాన్ని వినియోగించే విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలకు ఎంతో ఉపశమనం కలిగిస్తుంది. కేంద్రం తీసుకువచ్చిన నిర్ణయం డిజిటల్ ఇండియా స్మార్ట్ మౌలిక సదుపాయాల లక్ష్యానికి అనుగుణంగా ఉంటుంది.

● వి.మదనమోహన్, ప్రాజెక్టు హెడ్,
రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్, కర్నూలు

'స్త్రీశక్తి'కి సర్వం సిద్ధం

- పంద్రాగస్టు నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం
- జోన్-4 పరిధిలో 3,223 బస్సులు
- ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



నంద్యాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సూపర్-6 హామీల్లో భాగంగా ఆగస్టు15వ తేదీ నుంచి 'స్త్రీ శక్తి పథకం' పేరుతో కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత ప్రయాణం సదుపాయం కల్పిస్తోంది. ఐదు రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణం వెసులుబాటు కల్పించారు. అందుకు అనుగుణంగా జోన్-4 పరిధిలోని ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల ఆర్టీసీ డిపోల్లో 4,401 బస్సులు ఉండగా.. 3,236 బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని కడప జోన్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు వెల్లడించారు. ఇదే క్రమంలో ఉచిత ప్రయాణంతో పెరిగే రద్దీ నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆ దిశగా సిబ్బంది శిక్షణ నిర్వహించి ఉచిత ప్రయాణానికి సర్వం సిద్ధం చేశామన్నారు. నంద్యాల జిల్లా ఆర్టీసీ డిపో పర్యటనకు వచ్చిన ఆయనతో ఆంధ్రజ్యోతితో ప్రత్యేక ఇంటర్వ్యూ.

● జోన్-4 పరిధిలో ఉచిత ప్రయాణానికి ఎన్ని బస్సులు కేటాయించారు?

కడప జోన్-4 పరిధిలో కడప, అనంతపురం, కర్నూలు, చిత్తూరు ఉమ్మడి జిల్లాలు కలవు. ఇందులో 52 డిపోలు ఉండగా.. ప్రస్తుతం 4,401 బస్సులు నడుస్తున్నాయి. ఇందులో 3,236 బస్సుల్లో ఉచిత ప్రయాణం అవకాశం కల్పించాం. ఎక్కడైనా అవసరమైతే మరీ పెంచుతాం.

● ఏయే బస్సుల్లో ఉచిత ప్రయాణం?

ఐదు రకాల బస్సుల్లో ప్రభుత్వం ఉచిత ప్రయాణం సదుపాయం కల్పించింది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయవచ్చు. అయితే నాన్‌స్టాప్, అంతర్రాష్ట్ర కాంట్రాక్టు క్యారేజ్, ప్యాకేజీ, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, స్టార్ లైనర్, ఏసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సదుపాయం లేదు. ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గమనించాలి.

● నాలుగు ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీకి రోజువారి ఆదాయం ఎంత?

ప్రస్తుతం అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాల పరిధిలో 4,401 బస్సులు ప్రతి రోజు 11.19లక్షల కిలోమీటర్లు ప్రయాణం సాగుతోంది. ఇందులో 15.09 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణిస్తుండగా.. వీరిలో 40శాతం మహిళా ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతి రోజు ఆర్టీసీకి నాలుగు ఉమ్మడి జిల్లా పరంగా రూ.6.20 కోట్ల ఆదాయం వస్తోంది.

● స్త్రీ శక్తి పథకంతో ఆర్టీసీ ఆదాయం తగ్గుతుంది కదా?

స్త్రీశక్తి పథకం అమలైతే ప్రస్తుతం ఉన్న రోజు వారి మహిళా ప్రయాణికులకంటే రెట్టింపు స్థాయిలో పెరిగే అవకాశం ఉంది. ఆర్టీసీ కోట్ల రూపాయల మేర ఆదాయం తగ్గుతుంది. కానీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబునాయుడు ఉచిత ప్రయాణానికి అయ్యే ఖర్చును ప్రభుత్వం ఆర్టీసీకి జమ చేస్తుంది.

● ఏ జిల్లాల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది?

స్త్రీ శక్తి పథకం అమలుతో జోన్-4 పరిధిలోని తిరుపతి, నంద్యాల, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలో మహిళా ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉంది. ఆయా జిల్లాల్లో పుణ్యక్షేత్రాలు ఎక్కువగా ఉండటంతో మహిళల ప్రయాణం ఎక్కువగా సాగే అవకాశం ఉంది. ప్రధానంగా తిరుపతి, శ్రీశైలానికి ఎక్కువగా మహిళా ప్రయాణికులు వెళ్లే అవకాశం ఉంది.

● కొత్తగా సిబ్బందిని నియమించారా?

కడప జోన్-4 పరిధిలోని ఉమ్మడి జిల్లాల్లోని ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లను ఆన్‌కాల్ వారీగా తీసుకున్నాం. తీసుకున్న సిబ్బందికి కలిపి విడతల వారిగా సమగ్రంగా శిక్షణ కల్పించి అప్రమత్తం చేశాం. ఉచిత ప్రయాణంలో ప్రయాణికులకు ఎలాంటి సమస్య తలెత్తకుండా చూసుకుంటారు.

● ఉచిత ప్రయాణంతో బస్టాండ్లలో పెరిగే రద్దీపై చర్యలు తీసుకున్నారా?

స్త్రీ శక్తి పథకం అమలు నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ ఖచ్చితంగా పెరుగుతుంది. కావున నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని ఆర్టీసీ బస్టాండుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాం. ఆదిశగా ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ప్రధానంగా మరుగుదొడ్లు, తాగునీటి, కుర్చీలు, ఫ్యాన్లు తదితర వసతులు కల్పించాం. విచారణ కౌంటర్ వద్ద సమస్యలు తలెత్తకుండా నైపుణ్యం కలిగిన సిబ్బందిని నియమించేలా చర్యలు తీసుకున్నాం.

● ఉచితంగా ఎంతవరకు ప్రయాణం చేయవచ్చు?

ఉచిత ప్రయాణం రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా చేయవచ్చు. ప్రభుత్వం అందించిన ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్‌కార్డు తదితర గుర్తింపు కార్డు కలిగి ఉంటే బస్సులో ఉచితప్రయాణం ఉంటుంది. ఇతర రాష్ట్ర మహిళలకు ఉచిత ప్రయాణం ఉండదు.

ఆదర్శ పాఠశాల తనిఖీ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జేడీ దేవసాగర్

మహానంది, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.తిమ్మాపురం గ్రామ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలను మంగళవారం జేడీ దేవసాగర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యంపై కూడా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులకు గురికాకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి భగవాన్‌దాస్, ఎంపీహెచ్‌ఈవో ఉసేనిరెడ్డి, పీహెచ్ఎన్ అమీనాబీ, ఎంపీహెచ్ఎస్ నరసింహారావు, ఏఎన్ఎం దుర్గాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

మహానందీశ్వరుని సన్నిధిలో అటవీశాఖ ఫీల్డ్ డైరెక్టర్



ఆశీర్వాదం పొందుతున్న కాశీవిశ్వనాథరాజు

మహానంది, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో మంగళవారం అటవీ శాఖ ఫీల్డ్ డైరెక్టర్ కాశీ విశ్వనాథరాజు పూజలు నిర్వహించారు. ఆలయ ముఖ మంటపం వద్ద ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేకాభిషేకార్చన పూజలు చేశారు. కల్యాణమంటపంలో ఆయనున్న వేదపండితులు శాలువాతో సన్మానించి, ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి ప్రసాదాలు అందచేసారు. డీఆర్వో హైమవతి, రామకృష్ణ, ఎఫ్‌బీఓలు రాణాప్రతాప్ ఉన్నారు.

భూపనపాడుకు కలెక్టర్ రాజకుమారి

పాణ్యం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల వేదికలో వచ్చిన ఓఆర్జీపై కలెక్టర్ రాజకుమారి స్పందించారు. సమస్యను తెలుసుకునేందుకు నేరుగా గ్రామానికి వెళ్లి పరిశీలించారు. పాణ్యం మండలంలోని భూపనపాడు డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఇటీవల కలెక్టర్‌కు ప్రజలు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఆమె భూపనపాడులో పర్యటించారు. గ్రామంలోని బీసీ కాలనీలో రహదారులు, డ్రైనేజీ సమస్యలపై ప్రజలతో మాట్లాడారు. డ్రైనేజీ పూర్తిగా దెబ్బతిని మురుగునీరు రోడ్లపైకి వస్తోందని ప్రజలు తెలిపారు. రహదారులు దెబ్బతిన్నాయని, మరమ్మతులు చేయించాలని కలెక్టర్‌ను కోరారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. వర్షాకాలం కావడంతో అంటువ్యాధులు ప్రబలకుండా ఇళ్ల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏఈ మహబూబ్‌బాషా, సర్పంచ్ జనార్దన్ ఉన్నారు.

కుడి ఎడమైతే పొరపాటులేదోయ్..

- లెఫ్ట్ హ్యాండర్స్‌కు సమాజంలో ప్రత్యేక గుర్తింపు
- నేడు అంతర్జాతీయ లెఫ్ట్ హ్యాండర్స్ డే



ఆత్మకూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్.. ఓడిపోలేదోయ్.. అంటూ అలనాటి ప్రముఖ సంగీత విద్వాంసులు ఘంటసాల ఎన్టీఆర్ నటించిన దేవదాస్ చిత్రంలో ఆలపించిన గాత్రం అందరికి ఇప్పటికీ గుర్తు ఉండేపోతోంది. కుడి, ఎడమలన్నీ మానవదేహంలో సమానమేనన్న భావనను ఆయన తన గాత్రంతో స్వరపరిచారు. మంచి మనుసుతో చేసే ప్రతి కార్యం పవిత్రమైనదేనని దీనికి కుడి, ఎడమలేవి అతీతం కావని స్పష్టం చేస్తున్నారు. ఎడమ చేతివాటం వారు ప్రపంచవ్యాప్తంగా రాజకీయాల్లో, క్రీడల్లో, కళాకారుల్లో, సంగీత విద్వాంసులలో మరెన్నో ఇతర రంగాల్లో రాణించిన దృష్టాంతాలు ఉన్నాయి. వీరి ప్రతిభను గుర్తిస్తూ ప్రతిఏటా ఆగస్టు 13న అంతర్జాతీయ లెఫ్ట్ హ్యాండర్స్ డేగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

ఎలా ఆరంభమైందంటే..

1990లో తొలుత యునైటెడ్ కింగ్‌డమ్‌లోనే ఎడమచేతి వాడకస్తుల క్లబ్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా ఎడమచేతివాటం కలిగినవారు వాడే వస్తువులు తయారీలో ఈ క్లబ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. క్రమక్రమంగా ప్రపంచవ్యాప్తంగా లెఫ్ట్‌హ్యాండర్స్ క్లబ్ బలోపేతమై పలుదేశాల్లో అనుసంఘం కేంద్రాలు ఏర్పాటయ్యాయి. మొట్టమొదటి సారిగా 1992 ఆగస్టు 13వ తేదీన అంతర్జాతీయ లెఫ్ట్ హ్యాండర్స్ డేను జరుపుకోవడం ఆరంభించింది. అప్పటినుంచి ప్రతిఏటా ఇంటర్నేషనల్ లెఫ్ట్ హ్యాండర్స్ డేను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 10శాతం మంది ఎడమచేతి వాటం వాళ్లు ఉన్నట్లు ఓ అంతర్జాతీయ సర్వే ద్వారా తెలుస్తోంది.

భారత్‌లో పేరుగాంచిన లెఫ్ట్ హ్యాండర్స్ వీరే

భారత్‌లో వివిధ రంగాల్లో ఎంతో మంది ప్రముఖులు ఎడమచేతి వాటం కలిగి ఉన్నారు. మాజీ ప్రధానీ మన్మోహన్‌సింగ్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఎన్సీపీ నేత శరత్ పవార్, మాజీ కేంద్ర మంత్రి పి.చిదంబరం, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో పాటు ఏఆర్.రహిమాన్, అమిత్ త్రివేది, ఆదిత్య నారాయణ, అర్షద్‌వారసీ, రతన్‌టాటా, సుధామూర్తి, విక్రమ్‌సారాబాయి, కిరణ్‌మజుందార్‌షా, సౌరవ్‌గంగూలీ, యువరాజ్, గౌతమ్‌గంభీర్, ఇర్ఫాన్ పఠాన్, రవీంద్ర జడేజా, ఆసీస్ నెహ్రా, సురేష్ రైనా, రోహిత్ శర్మ, హార్థిక్ పాండ్యా, సైనా నెహ్వాల్, అమితాబ్‌బచ్చన్, అనుష్కశర్మ, కంగనా రనౌత్ ఎంతో మంది ప్రముఖులు వివిధ రంగాల్లో ఉన్నారు.

ఆనందంగా ఉంది



ఎడమ చేతివాటాన్ని కలిగి వున్న తమ లాంటి వారికి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక రోజును కేటాయించడం ఆనందంగా ఉంది. ఎడమ చేతివాటానికి అలవాటు పడటం మంచిదో.. లేదో తెలియదు కాని తమ చేతిరాతకు ప్రత్యేక గుర్తింపు వుండటం సంతోషంగా భావిస్తున్నాను.

● మోహన్‌సింగ్, ఉపాధ్యాయుడు, ఆత్మకూరు


ఎడమ చేతివాటం అలవాటైంది



బాల్యం నుంచే ఎడమచేతి వాటానికి అలవాటు పడ్డాను. చిన్నతనం నుంచే తనకు ఈ రకమైన ప్రత్యేకత రావడం ఆనందంగా ఉంది. లెఫ్ట్ హ్యాండర్స్ డే రోజునే నా బర్త్‌డే కూడా ఉండటం మరో ప్రత్యేకంగా భావిస్తున్నా.

- తేజ, ఇంటర్ విద్యార్థి,
తోటగేరి, ఆత్మకూరు

15న 'సైసైరా నరసింహారెడ్డి' నాటక ప్రదర్శన



కర్నూలు కల్చరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన 'సైసైరా నరసింహారెడ్డి' చారిత్రక నాటకాన్ని ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రదర్శిస్తున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. టీజీవీ కళాక్షేత్రంలో ఆగస్టు 15న సాయంత్రం 6:30 గంటలకు ఈ నాటక ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ప్రముఖ నంది అవార్డు గ్రహీత, దివంగత పల్లేటి లక్ష్మీకులశేఖర్ రాసిన ఈ నాటకానికి కళారత్న పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్య దర్శకత్వం వహిస్తున్నారు. గతంలోనూ నంది నాటక పోటీల్లో ఉత్తమ నంది బహుమతులు సాధించిన ఈ నాటకంలో టీవీ, సినీనటి సురభి ప్రభావతి, హసీనా, జీవీ శ్రీనివాసరెడ్డి, కె.బాలవెంకటేశ్వర్లు, వి. రాముడు, పి.రాజారత్నం, చల్లా నవీన్‌కుమార్ చౌదరి, పి.భాస్కర్, ఎస్.మహమ్మద్ మియా, గాండ్ల లక్ష్మయ్య వివిధ పాత్రలు ధరించినట్లు నాటక కన్వీనర్ కేవీ రమణ తెలిపారు. చారిత్రక గుర్తింపు పొందిన ఈ నాటకాన్ని ప్రేక్షకులంతా ఉచితంగా తిలకించవచ్చని కళాక్షేత్రం కార్యదర్శి సి.యాగంటీశ్వరప్ప, కోశాధికారి కె.రామస్వామి తెలిపారు.

డీ.ఫార్మసీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు శివారులోని బి.తాండ్రపాడు ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డీ-ఫార్మసీ రెండు సంవత్సరాల గల కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీఎస్ఎస్ఎన్ ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీ, రెగ్యులర్ లేదా ఓపెన్ స్కూల్ ద్వారా పాసైన అభ్యర్థులు ప్రవేశాలకు అర్హులన్నారు. సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు పత్రాలను బి.తాండ్రపాడు ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఫార్మసీ విభాగంలో ఈ నెల 19లోపు అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9441825230, 9666217061 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మరణంలో జననం.. చావు అనివార్యమై అచేతనావస్థలో ఉన్నా మరొకరి ప్రాణాలు నిలబెట్టగలిగితే.. అంతకన్నా గొప్ప విషయమేముంది.. అవయవ దానం అలాంటి సదావకాశాన్నే కల్పిస్తుంది. చనిపోయినా మరొకరిలో జీవించే వరాన్ని ప్రసాదిస్తుంది. అవయవాలు విఫలమై ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న దశలో ఉన్న మరొకరికి పునర్జన్మను ఇస్తుంది. మరణం నుంచి జననంలోకి అడుగేస్తుంది. ఇది ఎప్పటి నుంచో అందుబాటులో ఉన్నా చాలా మందికి దీని గురించి తెలియడం లేదు. సరైన అవగాహన లేకపోవడంతో ఎంతో మంది ముందుకు రావడం లేదు. అవయవ దానంపై అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం ఆగస్టు 13న ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

అవయవదానం..
మరొకరిలో జీవించే వరం



- అవయవదాతలుగా నమోదు కోసం 'జీవన్‌ధాన్' వెబ్‌సైట్
- సజీవదానంలో కిడ్నీ, కాలేయం, రక్తదానం వంటివి
- జీవన్మృతి దానంలో గుండె, ఊపిరితిత్తులు, పాంక్రియాస్
- ఒకరి నుంచి ఎనిమిది మందికి జీవనం
- ప్రపంచ అవయవ దాన దినోత్సవం

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అవయవదానంతో మరొకరిలో జీవించే వరం దక్కుతుంది. అవయవాలు విఫలమై ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న దశలో ఉన్న మరొకరికి పునర్జన్మను ఇస్తుంది. మరణం నుంచి జననంలోకి అడుగేస్తుంది. రాష్ట్రంలో ww-w.jeevandan.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా నమోదు చేయవచ్చు. గత ఏడాది రాష్ట్రంలో సుమారు 40వేల మంది డయాలసిస్‌పై రోగులు ఉన్నారు. దురదృష్టవశాత్తు వారిలో 50 శాతం మంది ఒక సంవత్సరంలో మృతి చెందగా కేవలం 2,500 మందికి కిడ్నీ మార్పిడి జరిగింది. కిడ్నీ కోసం వెయిటింగ్‌లో ఉండగా కేవలం 500 మంది కెడవరిక్ మార్పిడి శస్త్ర చికిత్సలు మాత్రమే జరిగాయి.

అవయవదానం రకాలు..

అవయవదానం రెండు రకాలు. ఒకటి లైవ్(సజీవ) దానం.. బతికున్నవారు అవయవాన్ని లేదా అవయవ భాగాన్ని దానం చేయడం. కిడ్నీ, కాలేయం, రక్తదానం వంటివి ఇలాంటివే. మనం ఒక కిడ్నీ ఉన్నా జీవించొచ్చు. కొంత భాగాన్ని దానం చేసిన కాలేయం తిరిగి వృద్ధి చెందుతుంది.


● రెండోవది కెడావర్ (జీవన్మృతి) దానం అంటే మరణించి బ్రెయిన్ డెడ్ తర్వాత అవయవాలను దానం చేయడం. దీనికి స్థిరపడిన వారు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. మరణించిన తర్వాత వారి సన్నిహిత కుటుంబ సభ్యులైన దానం చేయడానికి అంగీకరించొచ్చు. అవయవదాతలు ఎలా చనిపోయారన్నదీ కీలకమే. బ్రెయిన్‌డెడ్ అయిన వారి నుంచి గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, కాలేయం, పాంక్రియాస్, పేగుల వంటి కీలక అవయవాలను గ్రహించవచ్చు. ఒకవేళ సహజ మరణం అయితే కంటి కార్నియా, చర్మం, ఎముక, గుండె కవటాలు రక్తనాళాలు వంటి కణజాలాల దానానికి మాత్రమే వీలుంటుంది.

బ్రెయిన్ డెడ్ అయిన

బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీలు, కాలేయం, క్లోమం కంటి కార్నియా పేగులు ఇలా అవయవాలను సేకరించవచ్చు. అంటే ఒకరు బ్రెయిన్ డెడ్ అయితే ఎనిమిది మందికి ప్రాణం పోయవచ్చు. సేకరించిన అవయవాలను నిజంగా అవసరమైన వారికి 10, 15 సంవత్సరాల పాటు జీవించే అవకాశం ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో మూడు హాస్పిటల్స్‌కు అనుమతి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో జీవన్‌ధాన్ ట్రస్టు కింద మూడు హాస్పిటల్స్‌కు రిజిస్ట్రేషన్, అవయవదాన మార్పిడికి గుర్తింపు ఇచ్చింది. ఇందులో కర్నూలు జీజీహెచ్, కిమ్స్, మెడికవర్ హాస్పిటల్స్ ఉన్నాయి. కర్నూలు జీజీహెచ్‌లో 2017లో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు అనుమతి లభించింది. కిమ్స్ హాస్పిటల్‌కు జీవన్‌ధాన్ ట్రస్టు 2021 జూన్ 30వ తేదీ గుర్తింపు ఇచ్చింది.



కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జీజీహెచ్‌లోనే



కర్నూలు జీజీహెచ్‌కు జీవన్‌ధాన్ కింద కిడ్నీ, లంగ్స్, హార్ట్ అవయవాల సేకరణ మార్పిడి చేయడానికి అనుమతి ఉంది. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి కుటుంబ సభ్యులు అవయవదానానికి అంగీకరించిన తర్వాతనే అవయవాలను సేకరిస్తాం. రాష్ట్రంలోనే కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు ఒక కర్నూలు జీజీహెచ్‌లోనే నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో నాలుగు వేల మంది కిడ్నీ మార్పిడి కోసం ఎదురు చూస్తున్నారు.

- డాక్టర్ కే.వెంకటేశ్వర్లు,
సూపరింటెండెంట్,జీజీహెచ్, కర్నూలు

కిమ్స్ హాస్పిటల్‌లో జీవన్‌ధాన్



కిమ్స్ హాస్పిటల్‌లో ఇప్పటి వరకు జీవన్‌ధాన్ కింద 64 కిడ్నీ మార్పిడి, లివర్ మార్పిడి 51 ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించాం. ప్రతి సంవత్సరం దేశంలో 1.8 లక్షల మంది రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందుతున్నారు. వీరు అవయవదానం చేస్తే వేలాది మంది ప్రాణాలను కాపాడొచ్చు.

- డా.కే.అనంతరావు,
నెఫ్రాలజిస్టు అండ్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజిషియన్,
కిమ్స్ హాస్పిటల్, కర్నూలు

అక్రమ కేసు బనాయించడం దుర్మార్గం

ఆదోని, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన దళిత రమేష్‌పై వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ అక్రమ కేసు బనాయించడం దుర్మార్గమని మానవహక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు గోపాల్, మాల మహానాడు నాయకుడు జైభీమ్ సాయిరాం, పీఓడబ్ల్యూ నాయకురాలు సుజ్ఞానమ్మ అన్నారు. మంగళవారం బాధితుడు రమేష్‌తో కలిసి ప్రజా సంఘాల సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 30వ తేదీన ప్రభాకర్ టాకీస్ వద్ద ఉన్న రమేష్‌ను సీఐ శ్రీరామ్, కానిస్టేబుళ్లు జీపులో కంట్రోల్ రూమ్‌కు తీసుకెళ్లి బండ బూతులు తిట్టి లాఠీతో చితకబాదారన్నారు. బంగారు బజారులో తన స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని గోడ కట్టగా దానిపై రమేష్ కోర్టులో కేసు వేశాడన్నారు. దీనిపై రమేష్ పంచాయితీకి ఒప్పుకోలేదన్న అక్కసుతో పోలీసులు చిత్రహింసలకు గురిచేసి తప్పుడు కేసులు నమోదు చేశారన్నారు. సీఐ, కానిస్టేబుళ్లను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.


బాధితుడు రమేష్ ఒంటిపై లాఠీదెబ్బలు

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- బైక్‌ను ఢీకొట్టిన ట్రాలీ ఆటో

బనగానపల్లె, ఆగస్టు 12, (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామ క్రాస్‌రోడ్డు సమీపంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. వివరాలు.. బేతంచెర్ల పట్టణానికి చెందిన మధు పెద్దకుమారుడు చరణ్(19) బైక్‌పై ఊరుఊరు తిరుగుతూ మిక్సీలు, గ్యాస్ స్టౌలు రిపేరీ చేసేవాడు. మంగళవారం ఉదయం పలుకూరులో మిక్సీలు, గ్యాస్ స్టౌలు రిపేరుచేసి స్వగ్రామానికి వెళ్తున్నాడు. బేతంచెర్లకు చెందిన మనీ అయ్యర్ అనే వ్యక్తి ట్రాలీ ఆటో అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ తోడేళ్లగుట్ల వద్ద బైక్‌ను ఢీకొట్టాడు. చరణ్ తలకు, రెండు చేతులకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. చరణ్ మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం తరలించారు. మృతుడి తండ్రి మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మొక్కజొన్న పంటపై అడవి పందుల దాడి

- రూ లక్ష నష్టం


ధ్వంసమైన మొక్కజొన్న పంట

మహానంది, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటపై సోమవారం అర్ధరాత్రి అడవి పందులు దాడి చేశాయి. మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన రైతు కొండబోయిన వెంకటరమణ తన రెండెకరాల్లో మొక్క జొన్న సాగుచేశాడు. గ్రామ శివారులో ప్రాంతంలో రైతు సాగుచేసిన పంటపై అడవి పందులు దాడిచేసి పూర్తిగా ధ్వంసం చేశాయి. రూ.లక్ష మేర పంట నష్టం జరిగిందని బాధిత రైతు పేర్కొన్నాడు. అటవీశాఖ అధికారులు పరిశీలించి దెబ్బతిన్న పంటకు పరిహారం అందించాలని రైతు కోరాడు.

జూడో పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

- నంద్యాల జిల్లాకు రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ జూడో చాంపియన్ షిప్ పోటీల్లో నంద్యాల జిల్లా జట్టు మూడో స్థానం సాధించినట్లు జిల్లా జూడో సంఘం అధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన ఈ పోటీల్లో నంద్యాల జిల్లా క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబరిచారు. నంద్యాల జిల్లా ఏర్పడిన తర్వాత ప్రథమంగా జూడో క్రీడలో పతకం సాధించడం విశేషమన్నారు. ప్రతిభ కనబరచిన జిల్లా క్రీడాకారులను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు పతకాలు సాధించి రాష్ట్రానికి, జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. జిల్లా జూడో సంఘం కార్యదర్శి శాంత రాజు పాల్గొన్నారు.


మూడో స్థానం సాధించిన జూడో జట్టు

అవయవ దానంపై అవగాహన పెంచుకోవాలి

- 22 ఏళ్ల యువకుడికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్
- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కే.వెంకటేశ్వర్లు


కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయించుకున్న రోగితో సూపరింటెండెంట్, వైద్యులు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అవయవదానంపై అవగాహన పెంచుకోవాలని, మరణం అనంతరం 6, 7 మందికి ప్రాణదానం చేయవచ్చని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కే.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం ఆయన తన చాంబరులో విలేకరుల సమావేశం నిర్వహించారు. దేవనకొండ మండలం కరివేముల గ్రామానికి చెందిన 22 ఏళ్ల గుర్రం గిరిధర్‌కు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌ను నెఫ్రాలజీ, యురాలజీ వైద్యులు విజయవంతంగా నిర్వహించారన్నారు. నంద్యాల జిల్లా పాములపాడు మండలం కొత్తబనకచర్ల గ్రామానికి చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి జూలై 9వ తేదీ కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌లో చేరగా 16వ తేదీన బ్రెయిన్ డెడ్ అయ్యాడని వివరించారు. బ్రెయిన్ డెడ్ అయిన రోగికి జీవన్‌ధాన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న దేవనకొండ మండలం కరివేములకి చెందిన 22 ఏళ్ల గుర్రం గిరిధర్‌కు అదే నెల కర్నూలు జీజీహెచ్‌లో అడ్మిషన్ చేయించుకుని 17వ తేదీ కిడ్నీ మార్పిడిని వైద్యులు నిర్వహించారు. యురాలజీ హెచ్‌వోడీ డా.ముత్యాశ్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.బాలరవితేజ, నెఫ్రాలజీ హెచ్‌వోడీ డా.అనంతరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.వెంకట పక్కిరెడ్డి, డా.శ్రీధర్‌శర్మ అనస్థీషియా హెచ్‌వోడీ డా.విశాల ఆధ్వర్యంలో ఆపరేషన్ చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ బోధనా సుపత్రుల్లోనే మొట్టమొదటిసారిగా కర్నూలు జీజీహెచ్‌లో ఐదు కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు నిర్వహించారని, వైద్యారోగ్య శాఖ మంత్రి నుంచి ప్రశంసలు అందినట్లు ఆయన తెలిపారు. నెఫ్రాలజీ సీనియర్ వైద్య నిపుణురాలు డా.పిఎస్ జిక్కి, అనస్థీషియా ప్రొఫెసర్ డారామశివ నాయక్, సీఎస్ఆర్ఎంవో టీసీహెచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

కలాం.. సలాం

- ఉత్తమ పాఠశాలగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్
- వరుసగా నాలుగోసారి ఎంపిక
- 2025 'పది' ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో అగ్రభాగం
- స్వాతంత్ర్య వేడుకల్లో అందుకోనున్న అవార్డు



డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డా.ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలకు అరుదైన గౌరవం దక్కింది. 2024-25 విద్యాసంవత్సరానికి గానూ 10వ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలోనే (మున్సిపల్ యజమాన్యం విభాగంలో) అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించినందుకు గానూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేసింది. ఈనెల 15న స్వాతంత్ర దినోత్సవంలో భాగంగా అమరావతిలో రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉత్తమ పాఠశాల అవార్డును పాఠశాల ప్రధానోపాధ్యాయులు అందుకోనున్నారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఎంపిక కావడం ఇది వరుసగా నాలుగో సారి. దీంతో ఈ పాఠశాలకు ప్రత్యేకమైన గుర్తింపు లభించింది. కర్నూలు నగరంలో 2016 సంవత్సరంలో ఈపాఠశాలను ఫౌండేషన్ పాఠశాలగా అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ నెలకొల్పారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫౌండేషన్ పాఠశాలను రద్దు చేశారు. అప్పటి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బాలాజీ చొరవతో ఫౌండేషన్ స్కూల్‌గా పేరు మార్చి డా.ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలగా మార్చి రికగ్నైజ్డ్ తీసుకు వచ్చారు. 2022 సంవత్సరం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 40 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 40మంది పాసై వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థిని డెబ్బోరా మిజ్మోర్ 592/600 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో అగ్రభాగంలో నిలిచారు. 2023లో జరిగిన ఎస్ఎస్‌సీ పరీక్షలో 54 మందికి గానూ 53 మంది పాసై వంద శాతం సాధించారు. సుస్మిత్ అనే విద్యార్థిని 586/600 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. 2024 విద్యాసంవత్సరం పరీక్ష ఫలితాల్లో 48మంది హాజరై అందరూ పాసై వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. డి.ఇక్బాల్ అను విద్యార్థి 593/600 మార్కులు సాధించారు.

అందరూ పాసై..

2025 విద్యాసంవత్సరంలో 43 మంది పరీక్షకు హాజరు కాగా, అందరూ పాసై వంద శాతం సాధించారు. సాయిలిఖిత అనే విద్యార్థిని 597/600 మార్కులతో రాష్ట్రస్థాయిలో అగ్రభాగాన నిలిచారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ పాఠశాలలో చదివిన 206మంది విద్యార్థులు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. 54 మంది విద్యార్థులు ఇడుపులపాయ, నూజివీడు వంటి ట్రిపుల్ ఐటీలకు ఎంపికై ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. 2022 బ్యాచ్‌కు చెందిన రాగిమాన్ ఈశ్వర్ అనే విద్యార్థి జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకు సాధిచి కర్నూలు ఐఐటీ డీఎంకు ఎంపికై బీటెక్ ద్వితీయ సంవత్సరంలో సీఎస్ఈ బ్రాంచ్‌లో చదువుతున్నారు. పాఠశాలకు సొంత భవనం లేదు. మున్సిపల్ పాఠశాలల్లోని భవన సముదాయంలోనే కొనసాగుతుండటంతో ఇబ్బందిగా ఉంది

అవార్డు రావడంపై హర్షం



వరుసగా నాలుగోసారి రాష్ట్రస్థాయిలో ఉత్తమ పాఠశాలకు తమ పాఠశాల ఎంపిక కావడంపై హర్షం వ్యక్తంచేశారు. ఇదంతా గతంలో పనిచేసిన ఉపాధ్యాయుల సమష్టి కృషిగానే భావిస్తున్నాం. ఇదే స్ఫూర్తితో వచ్చే ఏడాది కూడా రాష్ట్రస్థాయిలో ఉత్తమ పాఠశాలగా రాణించేందుకు తమవంతు కృషిచేస్తాం.

● వి.మహేష్, ఇన్‌చార్జి హెచ్‌ఎం

ఇక్కడ చదివినందుకు గర్వపడుతున్నా



ఈ పాఠశాలలో చదివినందుకు గర్వపడుతున్నా. వరుసగా నాలుగుసార్లు ఉత్తమ పాఠశాలగా ఎంపిక అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుల కృషి, పట్టుదలకు నిదర్శనం. ఇక్కడే చదివి పదో తరగతిలో 562/600 మార్కులుతో పాసయ్యా. ఇంటర్‌లో 908/1000 మార్కులు సాధించా. జేఈఈ-మెయిన్స్‌లో ర్యాంకు తో కర్నూలు ఐఐటీ డీఎంలో బీటెక్ సీఎస్ఈ బ్రాంచ్‌లో ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. **- రాగిమాను ఈశ్వర్, పూర్వ విద్యార్థి**

వాణిజ్య బ్యాంకులకు దీటుగా అభివృద్ధి

- డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి
- పాలకమండలి సమావేశంలో కీలక తీర్మానాలు


మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వాణిజ్య బ్యాంకులకు దీటుగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకును ప్రగతి పథంలో నడపాలని కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ బి.విష్ణువర్ధన్ రెడ్డి అధికారులకు పిలుపునిచ్చారు. మంగళవారం కర్నూలు నగరంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బ్యాంకు అభివృద్ధి, రైతులకు ప్రయోజనాలు అందించే పలు నిర్ణయాలను తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రజలతో పాటు రైతుల సౌకర్యార్థం బంగారు ఆభరణాలపై వడ్డీ రేటు 9.2 శాతం నుంచి 9.10 శాతానికి తగ్గించేందుకు నిర్ణయం తీసుకున్నారు. సహకార బ్యాంకు సేవలను ప్రజలకు, రైతులకు మరింత దగ్గర చేసేందుకు కర్నూలు జిల్లాలో ఏడు నూతనశాఖలను ఏర్పాటు చేసేందుకు పాలకవర్గం ఆమోదించింది. గోనెగండ్ల, మద్దికెర, మామిదాలపాడు, వెల్దుర్తి, సీ.బెళగల్, కౌతాళం, కోసిగి కేంద్రాల్లో ఈ నూతన శాఖలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఈ మేరకు ఆర్బీఐకి నివేదికలు పంపించాలని చైర్మన్ ఆదేశించారు. కర్నూలు, నంద్యాల జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లోని రైతులకు అవసరమైన ఎరువుల వ్యాపారం చేసేందుకు ఒక్కో సంఘానికి రూ.25 లక్షల చొప్పున బ్యాంకు గ్యారెంటీ మంజూరు చేసేందుకు పాలకవర్గం నిర్ణయించింది. మామిదాలపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి చెందిన మునగాలపాడులో ఉన్న పాత గోదాము పునర్నిర్మాణానికి రూ.17.66 లక్షలను మొదటి విడతగా మంజూరు చేస్తూ చైర్మన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో రామాంజనేయులు, నాబార్డు ఏజీఎం డీడీ సుబ్బారెడ్డి, జిల్లా సహకార అధికారి వెంకటకృష్ణ, ఆప్కాబ్ డీజీఎం దినేష్ కుమార్, డీజీఎంలు ఉమామహేశ్వర రెడ్డి, సునీల్‌కుమార్, నాగిరెడ్డి, ఏజీఎం త్రినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు నియామక పత్రాలు

ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో ఇటీవల పరీక్షలు రాసి ఎంపికైన 37 మందికి డీసీసీబీ చైర్మన్ నియామక పత్రాలు అందించారు. బ్యాంకు అభివృద్ధి, ప్రజలు, రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా పని చేయాలని విష్ణువర్ధన్ రెడ్డి సూచించారు.

కాన్పు కోసం వస్తే కాటికి పంపారు

- సిజేరియన్ అనంతరం మహిళ మృతి
- న్యాయం చేయాలని భర్త, బంధువుల ఆందోళన


ఆందోళన చేస్తున్న బంధువులు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కాన్పు కోసం హాస్పిటల్‌కు వస్తే గర్భిణిని కాటికి పంపారని మృతురాలి బంధువులు ఆరోపించారు. బాధితుల కథనం మేరకు నగరంలోని పాతబస్తీకి చెందిన నజీయా బేగం నిండు గర్భిణి. ఆమె భర్త సమీర్‌బాషా, గైనకాలజిస్టు డా.రహేలా వద్ద రెగ్యులర్‌గా వైద్యం చేయిస్తున్నారు. సోమవారం రాత్రి ఆమెకు పురిటి నొప్పులు రావడంతో భర్త డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లగా డాక్టర్ సూచన మేరకు నగరంలోని ఎన్‌ఆర్‌పేటలో ఉన్న ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చేర్పించారు. మంగళవారం ఉదయం 8 గంటలకు సిజేరియన్ చేయగా మగశిశువు పుట్టాడు. అయితే తన భార్యను చూపించాలని డాక్టర్‌ను భర్త కోరాడు. ఇలా ఎన్నిసార్లు అడిగినా భార్యను చూపకపోవడంతో అనుమానం వచ్చి గట్టిగా నిలదీశారు. ఆమె మృతి చెందిందని వైద్యులు చెప్పడంతో బంధువులు ఆందోళనకు దిగారు. ఆపరేషన్ చేసిన డాక్టర్, మత్తు డాక్టర్ ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో గదిలోకి వెళ్లి తాళం వేసుకున్నారు. పోలీసులు రావడంతో మత్తు డాక్టర్ బయటకు రావడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. డాక్టర్‌పై కేసు పెట్టాలని, తమకు న్యాయం చేయాలని భర్త, బంధువులు డిమాండ్ చేశారు. పోలీసులు నచ్చజెప్పడంతో ఆందోళనను విరమించారు.

మరో ముగ్గురు!

- ఉమ్మడి జిల్లాలో టీడీపీ నేతలకు నామినేటెడ్ పదవులు
- ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆకెపోగు ప్రభాకర్
- 'విశ్వబ్రాహ్మణ'కు కె.పార్వతమ్మ 'బొందిలి' చైర్మన్‌గా విక్రమ్‌సింగ్



కర్నూలు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు రాష్ట్రంలో పలు నామినేటెడ్ పదవులను భర్తీ చేశారు. పదవుల పంపకాల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ఈసారి మరో ముగ్గురికి అవకాశం దక్కింది. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్‌కు ఏస్సీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. నంద్యాల జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మకు విశ్వబ్రహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కర్నూలు నగరం 49వ వార్డు ఇన్‌చార్జి, న్యాయవాది డి.విక్రమ్‌సింగ్‌కు బొందిలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీఠం దక్కింది. అయితే ఎన్నికల్లో పొత్తు, రాజకీయ సమీకరణల్లో భాగంగా సీట్లు త్యాగం చేసిన ఆదోని టీడీపీ ఇన్‌చార్జి కె.మీనాక్షినాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఈ దఫా కూడా నిరాశే మిగిలింది. ఈసారైనా వారికి నామినేటెడ్ పదవులు కేటాయిస్తారని ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాలకు చెందిన టీడీపీ నాయకులు ఎదురు చూశారు.

ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రభాకర్



ఆకెపోగు ప్రభాకర్ కోడుమూరు (ఎస్సీ) టీడీపీ టికెట్ ఆశించి భంగపడ్డారు. త్యాగానికి ప్రతిఫలంగా సీఎం చంద్రబాబు ఆయనకు ఆంధ్ర ప్రదేశ్ ఎస్సీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ పదవి ఇచ్చారు. 2001లో గూడూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 2004 ఎన్నికల్లో కోడుమూరు (ఎస్సీ) నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2004 నుంచి 2014 వరకు, 2019 నుంచి 2024 వరకు కోడుమూరు టీడీపీ ఇన్‌చార్జిగా కొనసాగారు. 2014-19 మధ్యలో ఏపీ ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పని చేశారు. టీడీపీ జిల్లా లీగల్ సెల్ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యదర్శిగా పని చేసిన అనుభవం ఉంది.

పార్వతమ్మకు విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ పీఠం



నంద్యాల జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ టీడీపీకి చేసిన సేవలను అధినేత, సీఎం చంద్రబాబు గుర్తించారు. విశ్వబ్రహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పీఠంపై ఆమెను కూర్చోబెట్టారు. ఈమె స్వస్థలం నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామం. 18 ఏళ్ల క్రితం కర్నూలుకు చేరుకున్న ఆమె కుటుంబం వ్యాపారంలో రాణిస్తున్నారు. 2009 ఎన్నికల ముందు టీడీపీలో చేరి క్రియాశీలకంగా మారారు. ఉమ్మడి కర్నూలు జిల్లా తెలుగుమహిళా ప్రధాన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. జిల్లా విభజన తరువాత నంద్యాల జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు.

విధేయ విక్రమ్‌కు 'బొందిలి' కార్పొరేషన్



రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్‌కు విధేయుడిగా ఉంటూ వస్తున్న న్యాయవాది డి.విక్రమ్ సింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో స్థానం దక్కింది. ఏపీ బొందిలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపిక చేశారు. న్యాయవాది వృత్తిలో రాణిస్తూనే టీడీపీలో ఓ సామాన్య కార్యకర్తగా ఉన్నారు. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కర్నూలు నగరపాలక సంస్థ 49వ వార్డు స్థానం నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేసి 120 ఓట్ల తేడాతో ఓటమి చెందారు.

డాక్యుమెంట్స్ అప్‌లోడు చేయాలి : కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మెమోలు, జీవోలు, సర్క్యులర్‌లు కార్యాలయ ఉత్తర ప్రత్యుత్తరాలు లాంటివి అని ఈపీటీఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో డాక్యుమెంట్స్‌ను స్కానింగ్ చేసి అప్‌లోడు చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. మంగళ వారం పీ-4 పాలసీ, ఈపీటీఎస్ డాక్యుమెంట్స్ అప్‌లోడు అంశాలపై కలెక్టర్ ఆర్డీవోలతో మున్సిపల్ కమిషనర్లుతో, ఎంపీడీవోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. హొళగుంద, కోసిగి, కృష్ణగిరి, మంత్రాలయం, మద్దికెర, కౌతాళం మండ లాల ఎంపీడీవోలు, కౌతాళం, ఆదోని, సి.బెళగల్, కోసిగి, ఆలూరు మండలాల తహసీల్దార్లు డాక్యుమెంట్స్‌ను త్వరితగతిన అప్‌లోడు చేయాలన్నారు. ఏడీ సర్వే, సర్వ శిక్ష అభియాన్ శాఖలు ఆన్‌లైన్ అప్‌లోడు చేసే ప్రక్రియ ఇంకా మొదలు పెట్టలేదన్నారు. పీ-4 పాలసీకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న నీడ్ అసెస్‌మెంటు సర్వేను బుధవారంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. పీ-4 పాలసీ కింద జిల్లాలో ఇప్పటి వరకు 50,904 బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకున్నారన్నారు. ఇంకా తొమ్మిది వేల బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ పెండింగ్‌లో ఉందన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ పాల్గొన్నారు.

కోటేకల్లులో ఫైరింజన్ బోల్తా


కోటేకల్ సమీపంలో బోల్తాపడ్డ ఫైరింజన్

ఎమ్మిగనూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణలో ముందుండే ఫైరిం జన్ వాహనం ప్రమాదానికి గురైంది. కోటేకల్లు గ్రామ సమీపంలోని అడ్డరోడ్డులో మంగళ వారం ఆదోనికి చెందిన ఫైరింజన్ వాహనం ప్రమాదవ శాత్తు బోల్తాపడింది. మంత్రాల యం నుంచి ఆదోనికి వెళ్తున్న ఫైరింజన్ కోటేకల్లు అడ్డరోడ్డుకు సమీపంలో వేగంగా ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి రోడ్డుపక్కన పొలంలోకి దూసుకెళ్లింది. అక్కడ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తాపడింది. అయితే ఫైర్ సిబ్బందికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. అగ్నిమాక శాఖ అధికారులు, సిబ్బంది వెంటనే ఫైరింజన్‌ను అక్కడి నుంచి ఆదోనికి తరలించారు.

కర్నూలు జీజీహెచ్‌లో సెక్యూరిటీ కార్యాలయంపై దాడి

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని సెక్యూరిటీ ఆఫీసుపై ఓ ముఖ్య ప్రజాప్రతినిధి అనుచరులు దాడులు చేయడం కలకలం రేపింది. మంగళవారం సెక్యూరిటీ ఏజెన్సీగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఈగల్ అండర్ సంస్థ 20 మందిని సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకుంది. ఈ నియమకాలు ఓ ప్రజాప్రతినిధికి ఆగ్రహం తెప్పించాయి. తమను కాదని ఏకపక్షంగా ఎలా సెక్యూరిటీ పోస్టులను భర్తీ చేస్తారనీ, ఈ నియామకాలు సరిగ్గా లేవని, ఆరోపణలున్న వ్యక్తులను నియమించారనీ సెక్యూరిటీ ఆఫీసర్లతో వాగ్వాదానికి దిగారు. ఆఫీసులో ఉన్న కుర్చీలు, బెంచీలను ఎత్తిపడేశారు. ఘటన జరిగిన తర్వాత ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు రాత్రి 10:30 గంటల సమయంలో సెక్యూరిటీ ఆఫీసును సందర్శించారు. సెక్యూరిటీ పోస్టుల విషయంలో ఇద్దరు నేతల మధ్య ఆధిపత్య పోరు ఆసుపత్రిలో ఇబ్బందికరంగా మారింది.

లోతట్టు ప్రాంతాలు జలమయం

వర్షం జోరు మంగళవారం కూడా ఏ మాత్రం తగ్గలేదు. వరద నీటితో వంకలు, వాగులు పొంగి పొర్లి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బండిఆత్మకూరు మండలం పెద్దదేవళాపురంలోని పాఠశాలలోకి వర్షపు నీరు ప్రవహించింది. ఎరుకల కాలనీలో రెండో రోజు కూడా వరద నీరు ప్రవహించడంతో బాధితులకు గ్రామస్థులు భోజనం అందించారు.



బండిఆత్మకూరులో ప్రభుత్వ పాఠశాలలోకి చేరిన వరద నీరు


తెగిన రాధా వంక గట్టు

బండిఆత్మకూరు, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి):మండలంలో సోమవారం రాత్రి కూడా జోరు వాన కురియడంతో పలు వాగులు, వంకల ప్రవాహాలు ఏ మాత్ర తగ్గుముఖం పట్టలేదు. ముఖ్య గా మద్దిలేరు, రాళ్ల, జళ్ల వాగులు, రాధా వంక మంగళవారం పొంగిపొర్లాయి. అలాగే పెద్దదేవళాపురం ఎర్రచెరువు, తుమ్మల చెరువులు నిండటంతో అదనపు నీరు రాధావంక గుండా ఏకంగా పెద్దదేవళాపురం గ్రామంలోకి చేరాయి. పాఠశాల గుండా నీరు ప్రవహించటంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపలేదు. అలాగే రాధావంకకు చెందిన వంక గట్టు పెద్దదేవళాపురం వద్ద తెగిపోవటంతో వరి నాట్లు నీట మునిగాయి. అలాగే ఏ కోడూరు వద్ద మద్దిలేరు వాగుపై ఉన్న అమృత పైపులైను అడ్డు కారణంగా సమీప వరి పొలాలు వందలాది ఎకరాల్లో నీట మునిగాయి. ఎరుకల కాలనీలోని సుమారు 20 ఇళ్లలోకి రెండవ రోజు కూడా వాన నీరు తగ్గలేదు. వాగులు, వంకల కారణంగా పంట పొలాలు నీటి మునగడంతో కర్నూలు, కడప కాలువ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి, కేసీ కెనాల్ అధికారులతో కలిసి సంతజూటూరు పికప్ అనకట్ట వద్ద నీటి ప్రవాహ ఉధృతిని పరిశీలించి కేసీకి నీటి విడుదలను తగ్గించారు. సాగు నీటి సంఘాల చైర్మన్లు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నీట మునిగిన సోయాచిక్కుడు

గడివేముల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో సోయాచిక్కుడు, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని రైతులు తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసు కోవాలని కోరుతున్నారు.

వెలుగోడులో 52.4 మిల్లీమీటర్ల వర్షం

వెలుగోడు మండలంలో సోమవారం రాత్రి నుంచి కురిసిన వర్షం 52.4 మిల్లీమీటర్లగా నమోదైంది. రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోకి నీరుచేరింది.

కొత్తపల్లిలో జలమయమైన రహదారులు

కొత్తపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి 90.8 మి.మీల వర్షపాతం నమోదు కాగా, సోమవారం రాత్రి కురిసిన వర్షానికి 40.8 మి.మీల వర్షపాతం నమోదైంది.నందికుంట గ్రామంలోని కుంటలు ఎక్కి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. కుంట నిండా గుర్రపుడెక్కలతో నిండి ఉండటంతో గ్రామం గుండా మోకాల్లోతు పైగా వరద నీరు చేరింది. నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ ప్రధాన రహదారితో పాటు డ్రైనేజీ, కుంటలో ఉన్న గుర్రపుడెక్కలను తొలగించి వరద నీరు నిల్వ ఉండకుండా చూస్తామని, ఈ విషయంపై సంబంధిత అధికారులతో కూడా చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.


కొత్తపల్లి: నందికుంటలో ఇరుక్కుపోయిన కారు



పాములపాడు: ఇస్కాల గ్రామ శివారులో ఉప్పొంగిన భవనాశి వాగు.. గడివేములలో నీటమునిగిన సోయాచిక్కుడు

సీఎంకు అన్నదాతల కృతజ్ఞతా ర్యాలీ

నందికొట్కూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకునే తమ ప్రభుత్వమని టీడీపీ నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మంగళవారం నందికొట్కూరులో నియోజకవర్గంలోని రైతులు తమకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలలో మొదటి విడతగా రూ.7 వేలు అందజేయడంతో నందికొట్కూరు పట్టణంలో ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతతో భారీ ర్యాలీ చేపట్టారు. ఆత్మకూరు రోడ్డు నుంచి పటేల్ సెంటర్ మీదుగా నందికొట్కూరు మార్కెట్ యార్డు వరకు ఈ ర్యాలీ సాగింది. మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ రైతులకు ముఖ్యమంత్రి చేసిన సహాయానికి ఆయనపట్ల రైతులు భారీగా ట్రాక్టర్లతోనూ, ఎద్దుల బండ్లతోనూ కృతజ్ఞతలు తెలపడం సంతోషంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పాలన సాగుతోందన్నారు.సూపర్ సిక్స్ పథకాల్లో ఇచ్చిన ప్రతి హామీని చంద్రబా బు నాయుడు నెరవేరుస్తూ ముం దుకు సాగుతున్నారన్నారు. ఆగస్టు 15న మహిళలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణం పథకం కూడా అమలు కానుందన్నారు.మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, యాదవకార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, మిడ్తూరు మండల కన్వీనర్ ఖాతా రమేష్‌రెడ్డి, పగిడ్యాల మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పాములపాడు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత ఒక్క కూటమి ప్రభుత్వానికే దక్కిందని రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్‌నాయుడు అన్నారు. మంగళవారం జూటూరు వద్ద టీడీపీ నాయకుడు హఫీజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయంగా కేంద్రం రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు కలిపి ఏడువేల రూపాయల మొదటి విడత సాయంగా అందిచిందన్నారు. టీడీపీ నేతలు మధుక్రిష్ణ, రామక్రిష్ణ, బషీరు, పూజల శివ రామిరెడ్డి, ఈశ్వరయ్య, లోకేశ్, పుల్లయ్య, సునీల్, అమర్‌నాద్, బొజ్జన్న పాల్గొన్నారు.


ఎద్దుల బండిపై ర్యాలీగా వెళుతున్న ఎమ్మెల్యే గిత్తా జయ సూర్య


మాట్లాడుతున్న మహేశ్‌నాయుడు

అంగన్‌వాడీల్లో నిబంధనలు గాలికి..


మూసి ఉన్న చిన్న అరుగు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రం


ఎస్సీ కాలనీలో మూతపడ్డ అంగన్‌వాడీ కేంద్రం

నంద్యాల రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి పోషకాహారం అందిస్తున్నాయి. వారికి ఎలాంటి రక్తహీనత తదితర సమస్యలు ఉండకూడదనేదే ప్రభుత్వ ధ్యేయం. అయితే ప్రభుత్వాలు పోషకాహారం సరిపడా పంపుతున్నా కొందరు అంగన్‌వాడీ కార్యకర్తలు పైనుంచి పోషకాహారం తక్కువగా వచ్చిందని చెప్పి వాటిని అమ్ముకుంటున్నట్లు సమాచారం. నంద్యాల మండలం చాబోలు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆంధ్రజ్యోతి పరిశీలించగా.. రామాలయం సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 5 లీటర్ల పాలను పంపిణీ చేయాల్సి ఉండగా 4 లీటర్లు మాత్రమే పంపిణీ చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నించగా పాల ప్యాకెట్లు తక్కువగా వచ్చాయని, అందరికీ సరిపడని తక్కువ పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం మరో లీటర్ అందజేశారు. కేంద్రంలో ఐదుగురు చిన్నారులు ఉండగా హాజరుపట్టికలో మాత్రం 12 మంది వచ్చినట్లు వేశారు.

శిథిలావస్థ భవనంలో చిన్నారులు

చాబోలు రామాలయం సమీపంలోని అంగన్‌వాడీ కేంద్ర భవనం పైకప్పు పెచ్చులూడి ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

సమయపాలన పాటించడం లేదు

అదే గ్రామంలోని చిన్న అరుగు, ఎస్సీ కాలనీలోని కేంద్రాల కార్యకర్తలు కూడా సమయపాలన పాటించడం లేదు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండాల్సి ఉండగా మధ్యాహ్నం 3 గంటలకే మూసి ఉన్నాయి. అలాగే ఆ మూడు కేంద్రాలకు అంగన్‌వాడీ బోర్డులు కూడా లేవు.

విచారించి చర్యలు తీసుకుంటాం

అంగన్‌వాడీలు సమయపాలన తప్పనిసరిగా పాటించాలి. నిబంధనలు పాటించని వారి పట్ల చర్యలు తప్పవు. పాలపంపిణీపై ఆన్‌లైన్‌లో కొన్ని సాంకేతిక సమస్యలున్నాయి. పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటాం.

\- కుమారి, సూపర్‌వైజర్, చాబోలు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి హరివర్ధన్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ(ఎం) కార్యాలయం ఎదుట ఐక్యవిద్యార్థి ఉద్యమ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని మారినా విద్యారంగ సమస్యలు మారడం లేదన్నారు. ఆగస్టు 15 నుంచి అమలుపరుస్తున్న ఉచిత బస్సులను మహి ళలకు కాకుండా విద్యార్థులకు ఇబ్బంది లేకుండా బస్సులను నడపాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు కిషోర్, అయేషా, పావని, నాని పాల్గొన్నారు.

చీకటి జీవోలను రద్దు చేయాలి: పీడీఎస్‌యూ


ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

నందికొట్కూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ విద్యాసంస్థల ప్రయోజనాల కోసం తీసుకొచ్చిన చీకటి జీవోలను తక్షణమే రద్దు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు ఆది డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో ధర్నా నిర్వహించారు. అనంతరం జీవో ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హక్కులను హరించేలా ప్రభుత్వ పాఠశాలల్లోకి, జూనియర్ కళాశాలల్లోకి విద్యార్థి సంఘాలు ప్రవేశించకుండా నిషేధిస్తూ ప్రభుత్వం జీవోలు విడుదల చేయడం బాధాకరమన్నారు. విద్యార్థి సంఘాలు రాజకీయం కోసం కాదని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికై, హక్కుల కోసం, విద్యారంగంలో ఉన్న అన్యాయాలపై పోరాటాలు చేస్తామన్నారు. ఈ పద్ధతిని విద్యార్థి సంఘాలపై నిషేదం విధించడం ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే చర్య అని ఆయన ఆరోపించారు. జీవోలను రద్దు చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

జూపాడుబంగ్లా, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండ్లెం, తరిగోపుల గ్రామాల్లోని బాధితులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అందజేశారు. మండ్లెం గ్రామానికి చెందిన షేక్ నూర్జహాన్‌కు రూ.65 వేలు, తరిగోపుల గ్రామానికి చెందిన నల్లబోతుల జయలక్ష్మీకి రూ.1.05వేలు మంజూరుకాగా వారికి ఆయా మొత్తాన్ని స్వయంగా వెళ్లి అందజేశారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, టీడీపీ మండల నేతలు మోహన్‌రెడ్డి, నారాయణ రెడ్డి, దొరాబాబు రెడ్డి, పరమేశ్వరెడ్డి, సాంబశివారెడ్డి, యుగందర్ రెడ్డి, ప్రస న్నలక్ష్మి, శాలు, ఎంపీడీవో గోపీకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ పాల్గొన్నారు.

మద్దిగుండం చెరువు గండి పరిశీలన


గండిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

మిడ్తూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వరదలకు మిడ్తూరు మండలం జలకనూరు గ్రామానికి చెందిన మద్దిగుండం చెరువుకు గండిపడటంతో మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మంగళవారం పరిశీలిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో నీరు-చెట్టుకింద అప్పటి కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేయడం వల్లే ఈ తప్పిదం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎపీ శబరిఆర్ఆర్ఆర్ ద్వారా రూ.7 కోట్లు నిధులతో మద్దిగుండం చెరువును బాగు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాంట్రాక్టర్లు మద్దిగుండం చెరువును నాసిరకం పనులు చేయకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ ప్రసాదు, డీఈ బసవరాజు, నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పల్లె రఘునాథ్‌రెడ్డి, స్వామిరెడ్డి, సత్యం రెడ్డి, తువ్వా అయ్యపురెడ్డి, రైతులు వెంకటేశ్వర్లు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సింగిల్‌విండో చైర్మన్‌గా లక్ష్మీకాంతరెడ్డి


మాట్లాడుతున్న లక్ష్మీకాంతరెడ్డి

పాములపాడు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపెంట గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం చైర్మన్‌గా టీడీపీ నాయకుడు లక్ష్మీకాంతరెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకిచ్చిన ఈ బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తానన్నారు. ఈ పదవి రావాడానికి ముఖ్య కారుకులైన నంద్యాల టీడీపీ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, శాసనసభ్యుడు గిత్తా జయసూర్యకు కృతజ్ఞతలు తెలిపారు.సర్పంచ్ మాణిక్యమ్మ, నెమిలి వెంకటరమణనారెడ్డి, రమణారెడ్డి, బాలస్వామి, మోహన్, లెనిన్‌బాబు, లక్ష్మీనాయక్, చంద్రశేఖర్‌గౌడ్, చాకలి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు

యూరియా కొరత సృష్టించొద్దు : ఏడీ


నానో యూరియా గురించి వివరిస్తున్న ఏడీ ఆంజనేయ

బండిఆత్మకూరు ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణం యజమానులు యూరియా కృత్రిమ కొరత సృష్టించొద్దని ఏడీ ఆంజనేయ సూచించారు. మంగళవారం బండిఆత్మకూరు, సంతజూటూరు గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిష్టర్లను ఆయన తనిఖీ చేశారు. అనంతరం, కాకనూరు, పెద్దదేవళాపురం గ్రామాల్లో ఏవో పవన్‌కుమార్‌తో కలిసి నీట మునిగిన వరినాట్లు, మొక్క జొన్న, మినుము పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ ఆయా గ్రామాల్లో రైతులతో మా ట్లాడుతూ రాసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని, యూరియా మొతాదుకు మించి వేయరాదన్నారు.
ఎరువులు కొన్నప్పుడు బిల్లులు విధిగా పొందాలని సూచించారు. నీట మునిగిన పంట పొలాలకు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని తెలిపారు. వెంట సిబ్బంది సాయి హిమబిందు, రామకృష్ణ, అర్ఫర్, యశోద పాల్గొన్నారు.

జీవన ఎరువులతోనే నేలను కాపాడుకోవచ్చు

మహానంది, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జీవన ఎరువులను ఉపయోగించడం వల్ల నేలను కాపాడుకోవచ్చని జిల్లా జలవనరుల కేంద్రం ఏడీఏ చెన్నయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని నందిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతు శిక్షణ కార్యక్రమంను మం డల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. డీఆర్సీ ఏఓ వెంకటేశ్వరరెడ్డి, విస్తరణాధికారులు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లుతో పాటు టీడీపీ నేతలు మహేశ్వరరెడ్డి, చెన్నయ్య పాల్గొన్నారు.

కొత్తపల్లిలో యూరియా కొరత లేదు : ఏవో

కొత్తపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలో యూరియా కొరత లేదని.. కొందరు కావాలనే యూరియా లేదని ప్రచారం చేస్తున్నారని, అలాంటి వారి మాటలు నమ్మవద్దని ఏవో అమీరున్నిసా బేగం అన్నారు. మంగళవారం కొత్తపల్లి వ్యవసాయ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు.

నాయీబ్రాహ్మణులకు సాయం అభినందనీయం : మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్ ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా నాయీబ్రాహ్మణులకు 200 యూనిట్లు ఉచితంగా విద్యుత్తు సరఫరా చేయడం అభినందనీయమని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పట్టణంలో పథకం అమలు చేయడానికి నిర్ణయం తీసుకున్నందుకు నంద్యాలలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. చిరు వ్యాపారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. దేవాలయాల్లో పని చేసే వారికి రూ.25 వేలకు పెంచారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 40వేలకు పైగా సెలూన్ షాపులు ఉన్నాయని వాటిని నెలకు 200 యూనిట్లు ఉచితం అన్నారు. దీంతో వారు ఆర్థికంగా స్థిరపడి మంచి జీవనం కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో నంద్యాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బావులకు గ్రిల్స్ ఏర్పాటు చేయాలి


తాగునీటి బావిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని సిద్దేపల్లి, వడ్లరామాపురం రస్తాలో ఉన్న మున్సిపాలిటీకి తాగునీటిని సరఫరా చేసే బావులకు గ్రిల్స్ ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు రణధీర్, సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయా బావులను వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. పట్టణంలోని పలు ప్రధాన కాలనీలకు తాగునీటి సరఫరా చేసే ఈ బావులకు సరైన రక్షణ లేకపోవడం వల్ల కుటుంబ కలహాల నేపథ్యంలో పలువురు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు ఉన్నాయని గుర్తుచేశారు. దీంతో ఆయా బావుల వద్ద రక్షణ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రామ్‌నాయక్, వీరన్న, వలి, దినేష్, సామేలు, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగించుకోండి

ఆత్మకూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):ఆత్మకూరు పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న శిక్షణా కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి స్కిల్ హబ్ సెంటర్‌లో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ కోర్సులకు సెప్టెంబరు నుంచి ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ కోర్సుకు సంబంధించి ఇంట ఆపై చదివిన వారికి, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుకు సంబంధించి డిగ్రీ లేదా బీటెక్‌లో కంప్యూటర్స్ చదివిన వారు అర్హులని తెలిపారు.

వెబ్ డెవలప్‌మెంట్ శిక్షణతో అవకాశాలు

పాణ్యం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వెబ్‌డెవలప్‌మెంట్ నేర్చుకునే యువతకు మంచి అవకాశాలు ఉంటాయని ఆర్కేడ్‌హబ్ వ్యవస్థాపకుడు అజిత్ కుమార్ గుర్రం అన్నారు. మంగళవారం ఆర్జీఎంలో సీఎస్ఈ విద్యార్థులకు మెర్న్ స్టాక్ ఆన్ వెబ్ డెవలప్‌మెంట్ అప్లికేషన్ శిక్షణా ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ యువత కృత్రిమ మేధస్సు, ఎంఎల్‌లతో సమ్మిళితం అవుతూ వెబ్ డెవలప్‌మెంట్‌లో నిష్ణాతులుగా తయారై అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

గడివేముల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆదర్శ పాఠశాలలో చట్టాలపై అవగాహన కల్పించారు. మత్తుపదార్థాలతో జీవితాలు నాశనం అవుతాయని, ప్రణాళికాబద్ధంగా విద్యనభ్యసించాలన్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోండి

మహానంది, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మహానంది మండలం బొల్లవరం గ్రామంలో ఎస్ఐ ప్రజలతో మాట్లాడారు. వినాయక చవితి పర్వదినాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మకు పూజలు

వెలుగోడు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు పట్టణంలోని రజక పేటకు చెందిన రజకులు మంగళవారం గంగమ్మకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ప్రతిఏటా జలాశయం నిండిన తర్వాత ఆనవాయితీగా ఈ కార్యక్రమం నిర్వహిస్తుంటారు. రజకపేట నుంచి బోనాలతో గ్రామోత్సవంగా గాలేరు నది ఒడ్డున ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సామూహిక భోజనాలు నిర్వహించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూరురూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):ఆత్మకూరు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ తిరుపాలమ్మ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సయ్యద్ ఉమ్మర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

నిత్యాన్నదానానికి విరాళం

నంద్యాల కల్చరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబికా మల్లికార్జునస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణ కోసం భక్తుడు విరాళం అందజేశారు. మంగళవారం విజయ వాడకు చెందిన సత్య ప్రసాద్ దంపతులు రూ.1,11,000 విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ పర్యవేక్షకులు రవికుమార్ దాతలకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు.

జాతీయ పోటీలకు 'ఆదర్శ' విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

పాణ్యం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జూనియర్స్ టార్గెట్ బాల్ జాతీయస్థాయి పోటీలకు పాణ్యం మోడల్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దినేష్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 8, 9 తేదీలలో తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్స్ టార్గెట్ బాల్ టోర్నమెంట్‌లో విద్యార్థులు రాహిల్, జావీద్, చైతన్యలు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి: డీఎస్పీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

డోన్ రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం ప్రపంచ యూత్ డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను డీఎస్పీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో హ్యాండ్స్ ప్రాజెక్టు మేనేజర్ మధుకుమార్, సిబ్బంది తోఫియా, షాజహాన్, మౌనిక, విజయలక్ష్మి పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 94మందికి ఉద్యోగాలు

కోవెలకుంట్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో జాబ్ మేళా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. మంగళవారం జాబ్‌మేళాలో సుమారు 10 ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. 196 మంది అభ్యర్థులు హాజరు కాగా 94 మంది ఉద్యోగ అర్హత సాధించారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి వి.శ్రీకాంత్‌రెడ్డి, అధ్యాపకులు మద్దిలేటి స్వామి, ఏపీఎస్ ఎస్‌డీసీ, ఎస్ఈఈ డీపీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో పంచాయతీ అభివృద్ధి

కోవెలకుంట్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సహకారంతోనే మేజరు గ్రామ పంచాయతీ అభివృద్ధి సాధ్యమని ఇన్‌చార్జి ఈవో ప్రకాశ్‌నాయుడు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చెత్త సంపద సృష్టి కేంద్రంలో వర్మీకంపోస్టు తయారు చేస్తున్నామన్నారు. అక్టోబరు 10 నాటికి 25 టన్నుల కంపోస్టు ఎరువు అమ్మడానికి సిద్ధంగా ఉంటుందన్నారు. కేజీ రూ. 10 చొప్పు రైతులకు విక్రయిస్తామన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

చాగలమర్రి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 10, 11 అంగన్‌వాడీ కేంద్రాలు, బాలికోన్నత పాఠశాల, కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. మంగళవారం జిల్లా మానిటరింగ్ అధికారి అంకిరెడ్డి మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1 నుంచి 2 సంవత్సరాల పిల్లలు 1.12 లక్షల మంది, 5 నుంచి 19 సంవత్సరాల పిల్లలు 3.66 లక్షల మంది ఉన్నారని, వారందరికీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలు మింగించామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎంపీహెచ్‌వో శివరాయ్య, వైద్యులు ఇమ్రాన్, హెచ్ఈ విజయభారతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

బనగానపల్లె, ఆగస్టు 12, (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో సెక్రటరీ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. కార్యక్రమంలో రీజనల్ సభ్యులు, ఎస్ఎస్‌వలి, ఎల్లయ్య, ప్రెసిడెంట్ జమ్ములయ్య, గ్యారేజ్ సెక్రటరీ దేవేందర్‌రెడ్డి, గఫార్, ప్రహ్లాద, ఓబులసు, రఫీ, నాయక్ , తిరుపాల్, ఎన్ఎంయూ కార్మికులు పాల్గొన్నారు.

కరాటేతోనే ఆత్మరక్షణ : బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కరాటేతోనే ఆత్మరక్షణ సాధ్యమని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. జాతీయస్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను, కరాటే మాస్టర్లను మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఆమె అభినందించారు. కార్యక్రమంలో మాస్టర్ బాషా, ఫిరోజ్ బాషా, క్రీడాకారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు


సంజామల, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): సంజామలలో ఎట్టకేలకు సీసీ రోడ్డు నిర్మాణానికి మోక్షం లభించింది. మండల పరిషత్ కార్యాలయం నుంచి తహసీల్దార్ ఆఫీసు మీదుగా కాణాల రస్తాలకు వెళ్లే రోడ్డుకు త్వరలో సీసీ వేయనున్నారు. రోడ్డు చిన్నగా ఉండటంతో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడేవారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ. కోటి నిధులు విడుదల చేయించారు. దాంతో దాదాపు 700మీటర్లు ఉన్న రోడ్డుపై త్వరలో సీసీ రోడ్డు వేయనున్నట్లు పీఆర్‌డీఈ నాగశ్రీనివాసులు, ఏఈ రషీద్ తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే సంజామలలో ట్రాఫిక్ సమస్య పూర్తిగా తీరుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

యువత దేశానికి వెన్నెముక

శిరివెళ్ల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : యువత దేశానికి వెన్నెముక అని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రావతి అన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలు అంశాలపై నంద్యాల మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసరావు, యర్రగుంట్ల పీహెచ్‌సీ వైద్యుడు అష్రఫ్ అలీ, ఆళ్లగడ్డ చైతన్య రూరల్ సొసైటీ మేనేజర్ వర్ధనాచారి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్మయి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

వంకను పూడ్చారు.. వరదను తెచ్చారు

- నీటి ఉధృతికి కూలిన చీనీ చెట్లు
- రైతులకు తీవ్ర నష్టం


నేలకూలిన చీనీ చెట్లు

కొలిమిగుండ్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్ల, పెట్నికోట సమీపంలో నూతనంగా ర్మిస్తున్న అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ వారి వంకను పూడ్చివేశారు. దీంతో ఒక్కసారి గా వరద ఉధృతమైంది. ఈప్రవాహంతో సమీపంలోని చీనీతోటలు నేల కూలాయి. అపార నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు కొలిమి గుండ్లకు చెందిన మద్దిలేటిరెడ్డి, లక్ష్మీదేవి, పెద్దయ్య తది తరులు వా పోయారు. పరిశ్రమలోకి రహదారి ఏర్పాటు చేసుకునే క్రమంలో వంకను పూడ్చడం వల్లనే ఈపరిస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు తీసుకొని నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు.

యూరియా సరఫరా చేయాలి

రుద్రవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయకార్యదర్శి రామచంద్రుడు, మండల అధ్యక్షులు గుర్విరెడ్డి కోరారు. మంగళవారం వ్యవసాయ కార్యాలయంలో ఏవో సుమతికి వినతిపత్రం అందించారు. సహాయ కార్యదర్శి నరేశ్, రైతులు నర్సిరెడ్డి, నారాయణ, షరీఫ్ తదితరులున్నారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కోవెలకుంట్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో రామసుబ్బారెడ్డి, కేవీ రమణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రానైట్‌పై ట్రంప్ పిడుగు

- ఎగుమతులపై 25 శాతం సుంకం పెంపు
- డోన్‌లో సంక్షోభంలో గ్రానైట్ పరిశ్రమలు


కొత్తపల్లి గ్రామ పరిసరాల్లో నడుస్తున్న ఫ్యాక్టరీ

డోన్ రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ పరిశ్రమలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పిడుగు వేశారు. గ్రానైట్ ఉత్పత్తుల ఎగుమతులపై 25 శాతం సుంకం విధించడంతో గ్రానైట్ పరిశ్రమపై వాటి ప్రభావం పడి మరింత కుదేలయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అమెరికా, భారత్ దేశాల వాణిజ్య ఒప్పందాలలో సయోధ్య కుదరకపోతే భవిష్యత్తులో గ్రానైట్ పరిశ్రమ కోలుకునే పరిస్థితి ఉండదని పలువురు పరిశ్రమల యజమానులు వాపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ విధానాలు, కరోనాతో ఆర్థిక మాంద్యం తదితర అంశాలతో గ్రానైట్ పరి శ్రమ సంక్షోభంలో కూరుకుపోయింది. మండలంలోని కోట్లవారిపల్లె, కొచ్చెర్వు ప్రధాన రోడ్లలో ఉన్న పలు గ్రానైట్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. పట్టణ సమీపంలోని కొత్తపల్లిలో ప్రధాన రోడ్డులో గ్రానైట్ ఫ్యాక్టరీలు నడుస్తున్నాయి. డోన్ మండల పరిధిలో 55 గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉండగా.. 40 ఫ్యాక్టరీలు ఇప్పటికే మూసివేశారు. అయితే భవిష్యత్తులో ఎగుమతుల సుంకాల ప్రభావంతో గ్రానైట్ ఫ్యాక్టరీల నిర్వహణ భారం కానున్నదని పరిశ్రమల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్యానికి సంబంధించిన ఎగుమతులపై సుంకాలు పెంచడంతో గ్రానైట్ పరిశ్రమలు మరింత లోతుల్లో కూరుకపోయే ప్రమాదం ఏర్పడింది.

సుంకాల పెంపుతో భారం పెరిగింది



గ్రానైట్ ఉత్పత్తుల ఎగుమతులపై అమెరికా దేశం సుంకాలు విధించడం బాధాకరం. భారతదేశంతో వాణిజ్య ఒప్పందాల విషయంలో సయోధ్య కుదరకపోవడంతో అమెరికా అధ్యక్షులు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు పరోక్షంగా గ్రానైట్ పరిశ్రమలపై పడుతుంది. గ్రానైట్ ఉత్పత్తుల ఎగుమతులపై సుంకం పెంచడం వల్ల నిర్వహణ భారంగా మారనుంది.

● నబీ రసూల్, గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్, కొత్తపల్లి

ఇప్పటికే కొన్ని మూతపడ్డాయి



గత వైసీపీ ప్రభుత్వంలో వచ్చిన కరోనా, ఆర్థిక మాంద్యం, ప్రభుత్వ అసంబద్ధత విధానాలు, తదితర కారణాలతో గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు ఇప్పటికే కొన్ని మూసివేశారు. తమ పరిధిలో మూడు ఫ్యాక్టరీలు ఉండగా.. నిర్వహణ భారమై రెండు మూసివేశాం. ప్రస్తుతం ఉన్న ఫ్యాక్టరీని కూడా భారంగానే నడుపుతున్నాం. గ్రానైట్ ఉత్పత్తుల ఎగుమతులపై సుంకాల పెంచడంతో పరి శ్రమలపై పరోక్షంగా ప్రభావం చూపనుంది.

● బైసాని రాజు, గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్, డోన్


గ్రానైట్ ఫ్యాక్టరీ

బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యం

- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

బనగానపల్లె, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలోని పొదుపు భవనం ఆవరణంలో నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మంత్రి బీసీ మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీరాములు, రామ మద్దిలేటి, నాగమధు, శివయ్య పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ

నియోజకవర్గంలోని సమస్యలను అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలో మంత్రిక్యాంపు కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పనులు వేగవంతం చేయాలి

పట్టణంలోని ఖాజీవాడాలో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. అండర్‌డ్రైనేజీ , సీసీ రోడ్ల పనులను మంత్రి పరిశీలించారు. స్థానికంగా రూ.1.27 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు 50శాతం పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన పనులను నెల రోజుల్లో పూర్తి చేసి ప్రజలను అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ నాగశ్రీనివాసులు, టీడీపీ నాయకులు అల్తాఫ్ హుసేన్, కలాం, షమీ, యా గంటిపల్లె దస్తగిరి, గోపాల్‌రెడ్డి, మహబూబ్‌బాష, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.


సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, నాయీబ్రాహ్మణులు

రేపటితరానికి మార్గదర్శకులుగా నిలవాలి

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నేటి యువకులే రేపటి తరానికి మార్గదర్శకులుగా నిలువాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. అంతర్జాతీయ యువ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆళ్లగడ్డలోని డీఎస్ మినీ ఫక్షన్ హాల్‌లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో 'ఆస్క్ అఖిలప్రియ ' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. విద్యార్థులు పలు సమస్యలను ఎమ్మెల్యేకు తెలియజేశారు. ప్రభుత్వ వైద్యశాలలో సరైన వైద్యం అందడం లేదని గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేలా కృషి చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. యువకులు క్రమశిక్షణతో చదువు పూర్తి చేసి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. సమావేశంలో వివిధ కళాశాలల నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

పోస్టర్ ఆవిష్కరణ

జిల్లా ఆరోగ్య శాఖ, చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన పోస్టర్‌ను పట్టణంలోని ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మంగవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు కాశీ విశ్వనాథ్, మేరీ, సుమలత, ఐసీటీసీ కౌన్సిలర్ దేవకుమారి పాల్గొన్నారు.

కుండపోత వర్షం

- పొంగి ప్రవహిస్తున్న కుందూ, వక్కిలేరు

చాగలమర్రి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేని వర్షం కురిసింది. మంగళవారం తెల్లవారు జామున కుండపోత వర్షం కురిసింది. 21.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ వర్షంతో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దేవాలయ ప్రాంగణాలు, రహదారులు జలమయమయ్యాయి. తహసీల్దార్, పశువైద్య కేంద్రాలలో వర్షపు నీరు, మురికి నీరు కలిసి ప్రవహించడంతో అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రాజోలి ఆనకట్ట వద్ద కుందూనది పొంగి ప్రవహించింది. మల్లేవేముల గ్రామ సమీపంలోని కుందూ వంతెనపై వరద నీరు పొంగి ప్రవహించడంతో ఆ దారిన వెళ్లే బస్సులు, వాహనదారుల రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. కుందూ, వక్కిలేరు పరిసర గ్రామాల ప్రజలు నీటి దాటే ప్రయత్నం చేయరాదని తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎస్ఐ సురేష్ సూచించారు.


మల్లెవేముల సమీపంలో కుందూ వంతెనపై ప్రవహిస్తున్న వరద

కుందూ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఉయ్యాలవాడ : మండలంలోని కుందూతీర ప్రాంతాల్లో ఉన్న గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీతహసీల్దారు ప్రసాద్‌బాబు సూచించారు. మంగళవారం బోడెమ్మనూరు, రూపనగుడి గ్రామాల కుందూ వంతెన వద్ద నీటి ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు. బోడెమ్మనూరు గ్రామ సమీపంలోని కుందూ వంతెనపై నీరు వచ్చి చేరడంతో అక్కడ రాకపోకలు నిలిపివేశామన్నారు. డీటీ వెంట వీఆర్వోలు వెంకటేశ్వర్‌రెడ్డి, దాదాసాహెబ్, లక్ష్మన్న, చెన్నప్ప ఉన్నారు.

'హర్‌ఘర్ తిరంగా' ర్యాలీ

చాగలమర్రి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీని మంగళవారం తహసీల్దార్ విజయ్‌కుమార్, గ్రామ సర్పంచ్ తులశమ్మ, ఈవో తారకేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతీయ జెండాలను చేత పట్టుకొని వీధుల్లో నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో తాహిర్‌హుసేన్, ఆర్ఐ అబ్దుల్‌సత్తార్, వీఆర్వోలు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, మహిళా పోలీసులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

డోన్ టౌన్: పట్టణంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సందు వెంకటరమణ మాట్లాడుతూ దేశ సమైఖ్యత, సమగ్రత జాతీయ భావాలు పటిష్టమైన నాయకత్వం ఉంటే దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అనంతరం జాతీయ జెండాను ప్రతి ఇంటిపై ఎగురవేయాలని సూచించారు. పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బద్రి సుధాకర్, ఒంటెద్దుబండి కిరణ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గాజుల ఉషా లక్ష్మి, జిల్లా కన్వీనర్ ఆరబోలు వీరేష్, సుబ్రహ్మణ్యం, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



చాగలమర్రిలో జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న అధికారులు


డోన్‌లో జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు

డోన్ రూరల్: మండలంలోని ఉడుములపాడు గ్రామంలో ఆజాది కా అమృత్ మహోత్సవ్, హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అమృత్ సరోవర్ వద్ద ఉపాధి హామీ కార్మికులతో కలిసి గ్రామ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యనారాయణ జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాధ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో అబ్దుల్ షుకూర్, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

బేతంచెర్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మద్దిలేటి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ఆటో డ్రైవర్లు, సీఐటీయూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ నేపథ్యంలో ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మారుతికి వినతి పత్రం అందజేశారు. నాయకులు సంజీవనాయుడు, రామాంజనేయులు, వెంకటరమణ, తిరుమల్, మద్దయ్య, కుళాయి వెంకటేశ్వర్లు, విశ్వనాథ్, ఫక్రుద్దీన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

బనగానపల్లె, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీ మాత ఆలయాభివృద్ధికి దాతలు మంగళవారం విరాళం అందించారు. నంద్యాల జిల్లా యాళ్లూరు గ్రామానికి చెందిన గంగుల శంకర్‌రెడ్డి, కృష్ణవేణి, ప్రవీణ్‌రెడ్డి, జస్వంతి, దినేష్‌రెడ్డి కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం రూ.లక్ష విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో పీవీ. నాగార్జున రెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

కొలిమిగుండ్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీల అభివృద్ధిపై ఒక్క రోజు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు, కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

75 ఎకరాల్లో బయోగ్యాస్ ప్లాంట్

చాగలమర్రి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించినట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 75 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించామన్నారు. భూసరిహద్దులు ఏర్పాటు చేశామన్నారు. భూ సమస్యల పరిష్కారానికి రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అబ్దుల్‌సత్తార్, వీఆర్వోలు ఉన్నారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

చాగలమర్రి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు అభివృద్ధి పనుల కోసం రూ2.50 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని పీఆర్ ఏఈ కొండారెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఫేజ్ -1 కింద పలు గ్రామాల్లో 49 పనులు చేశామన్నారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు ఫేజ్ -2 పనులకు ప్రతిపాదనలు పంపామన్నారు.

పాలకవర్గానికి దరఖాస్తు చేసుకోవాలి

బనగానపల్లె, ఆగస్టు 12, (ఆంధ్రజ్యోతి): యాగంటి ఉమా మహేశ్వరస్వామి ఆలయ నూతన పాలకవర్గానికి దరఖాస్తు చేసుకోవాలని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తిగల అభ్యర్థులు దేవాదాయశాఖ, ధర్మాదాయశాఖ నిబంధనల మేరకు ఈవో కార్యాలయంలో 20రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు యాగంటి ఈవో కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

సమస్య పరిష్కారం

కోవెలకుంట్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గుద్దేటి కాలనీ బోరు రోడ్డుకు అడ్డుగా ఉండేంది. దాంతో నిత్యం ప్రమాదాలు జరిగేవి. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సమస్య పరిష్కరించలేదు. కాలనీవాసులు టీడీపీ నాయకులు లాల్‌పేట మోహన్ రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గోపి, నాగేంద్ర చాకలి మద్దిలేటి దృష్టికి తీసుకెళ్లి ఈవోఆర్‌డీని కలిశారు. ఈవోఆర్‌డీ ప్రకాశ్‌నాయుడు స్పందించి రెండు అడుగుల ఎత్తులో ఉన్న బోరు పైపు తొలగించి రోడ్డు లెవల్‌కే పైపు అమర్చి సమస్య పరిష్కరించారు. దాంతో కాలనీవాసులు టీడీపీ నాయకులకు, ఈవోఆర్‌డీకి కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ నాయకుడి మృతి తీరని లోటు

శిరివెళ్ల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని య ర్రగుంట్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వెదుర్ల నాగేశ్వరరావు మృతి చెందడం పార్టీకి తీరని లోటు అని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సోమవారం అర్ధరాత్రి గుండెపోటుకు గురై నాగేశ్వరరావు మృతి చెందాడు. మంగళవారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, భార్గవ్‌రామ్ దంపతులు గ్రామానికి చేరుకుని ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాం త్‌రెడ్డి, టీడీపీ, జనసేన నాయకులు, గ్రామ పెద్దలు, కాపు సామాజిక నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

'రాహుల్‌గాంధీ అరెస్టు దారుణం'

చాగలమర్రి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, ఎంపీ ప్రియాంకగాంధీ, ఇండియా కూటమి నాయకులను అరెస్టు చేయడం దారుణమని ఏపీ రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీ ఉపాధ్యక్షుడు మౌలాన అబ్దుల్‌మజీద్ ఖండించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో ఎన్నికల కమిషన్ డిజిటల్ ఓటర్ లిస్టు ఇవ్వాలని, ఓటరు జాబితా తప్పుల తడకతో ఉందని, సరి చేయాలని అడిగితే అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ఎన్నికల కమిషన్ బీజేపీకి వత్తాసు పలకడం శోచనీయమన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

బేతంచెర్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పట్టణంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర మాజీ కార్యదర్శి రవీంద్ర నాయక్, రాష్ట్ర నాయకులు భార్గవ్ హాజరై ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు తిరుమలేష్, విజయ్, ప్రదీప్, ఎల్లకృష్ణ, మధు, ఖదీర్, శ్రీకర్, దిలీప్, భాస్కర్, శ్రీమన్నారాయణ, గణేష్, మనోజ్, ఖాజా, మహబూబ్, సూరజ్, సురేష్, సీపీఐ నాయకులు దస్తగిరి, బాలు విద్యార్థులు పాల్గొన్నారు.

బనగానపల్లె: పట్టణంలో ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సంజీవులు, బాలకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి, బనగానపల్లె మండల కార్యదర్శి ప్రశాంత్, చందు, మనోజ్, మహేశ్, రమేశ్, షాషావలి, మహేంద్ర, అర్జున్ , జగన్ తదితరులు పాల్గొన్నారు.

'అసంబద్ధ నిర్ణయాలు విద్యారంగానికి శాపాలు'

బేతంచెర్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అసంబద్ధ నిర్ణయాలు విద్యారంగానికి శాపాలుగా మారాయని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆజాంబేగ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంఈవో-1 పోస్టులను ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న పాఠశాల సహాయకులతో భర్తీ చేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో ఎం.పుల్లయ్య, పాపారాయుడు, క్రిష్ణ, ఆదినారాయణ, సుబ్బారెడ్డి, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ షాపులు తనిఖీ

డోన్ టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెడికల్ షాపులను మంగళవారం సాయంత్రం కర్నూలు ఔషధ తనిఖీ అధికారి ఎస్.జయరాముడు తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. ఆరు మెడికల్, రెండు హోల్‌సేల్, రెండు రిటైల్ షాపులను పరిశీలించి ఆరు రకాల మందులను సేకరించి ల్యాబ్‌కు పంపించారు.